శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!



## శ్రీబాబూజీ - అభయం

క్లోజ్‌గా బాబాను పట్టుకోండి.  చక్కగా బాబాను చూపించాను
బాబా తత్త్వమేమిటో చెప్పాను, పట్టుకోండి. మిమ్మల్ని ఎలా తీసుకుపోవాలో నాకు తెలుసు
చక్కగా ఉండండి, మీకేమీ లోటు రాదు, నేను చెబుతున్నాను కదా!
**ఆ అభయం కూడా నేను ఇస్తున్నా!**

ఆరాధనోత్సవ సంచిక

# గురుకృప

ఆరాధన - నివేదన



మహాత్ములు యజ్ఞార్థము (తనవాణ్ణి తనంతవాడిగా ఎదిగించే కార్యము) జీవించిరి.
మహిమాన్వితులైనప్పటికీ మానవులలో ఒకరిగా జీవించిరి. అట్లు జీవించుచూ ధర్మము నేర్పిరి.
దైవారాధనము నేర్పిరి. లోకహిత కార్యములను చేయుట నేర్పిరి.
వారేదీ బోధించక, నేర్చుకునేట్లు చేసిరి.
అన్నింటికీ మించి వారు అప్రకటితముగా వుండి (వారి ద్వారా లభించిన ప్రతిదాన్ని
బాబాకు ఆపాదించే తత్త్వం - వినయం) లోకహిత కార్యములను ప్రకటించిరి.
అట్లు జీవించవలెనని అనుయాయులకు వారు ఆచరణయుక్తంగా బోధించిరి.
అనుయాయులు అట్టి ప్రయత్నమున నిమగ్నులగుటయే (సద్గురు ఆరాధనోత్సవం)
వారు ప్రేమతో తమ గురుదేవులకు సమర్పించు వినయపూరిత పుష్పాంజలి.

సంపుటి : 15
నవంబర్ 20

సంచిక : 5
2012


# గురుకృప



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



## లోపలి పేజీలలో

పవిత్ర క్షేత్రాలు 4
- శరశ్చంద్రికలు

ఆనంద పారవశ్యం - వ్యక్తీకరణ 10
- శరశ్చంద్రికలు

ఆ అడగడం నేర్పుటే సాయిపథం 16
- గురుకృప

తపించి తరించే ఆనవాలు - ఆరాధనోత్సవం 19
- గురుకృప


మహాత్ముల సన్నిధి - సాన్నిధ్యం 21
- ఆర్థర్ ఆస్బర్న్

నిరాడంబరతకు నిలువుటద్దం 26
- డాక్టర్ బి.ఎస్.రెడ్డి

నిర్వహణ : **గురూజీ ఆశీస్సులతో - గురుబంధువులు**
GURUKRUPA, 2-1-6, Gandhi Chowk, Tenali-01.
Ph : 93933 61778
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



## పవిత్ర క్షేత్రాలు - అక్టోబర్ 2012



**భక్తుడు :** ఒక ప్రదేశానికి పవిత్రతను చేకూర్చేదేమిటి?

**గురువుగారు : సద్గురు సన్నిధి ఏ ప్రదేశాన్నైనా పవిత్ర క్షేత్రంగా చేస్తుంది. సద్గురు సాన్నిధ్యమే నిజమైన పుణ్యక్షేత్రం.** శిరిడీ ఎందుకు అంత పవిత్ర క్షేత్రమయింది? అది బాబా సన్నిధి కాబట్టి (పుణ్యక్షేత్రమైంది). అక్కడ గంగానది లేదు, హిమాలయాలు లేవు, మునులు ఎవ్వరూ అక్కడ తపస్సు చెయ్యలేదు – ఇలాంటివేవీ లేవు. కేవలం అది బాబా సన్నిధి కాబట్టే పవిత్రక్షేత్రమయింది. **ఏ ప్రదేశమయినా కేవలం సద్గురు సాన్నిధ్యం చేతనే పవిత్ర క్షేత్రమవుతుంది.**

**భక్తుడు :** గురువుగారూ! మేము శిరిడీ, పూండీ, తిరువణ్ణామలై తదితర పవిత్ర క్షేత్రాలకు సంబంధించి ఆ సద్గురు సన్నిధిని ఉపయోగపెట్టుకోవడం ఎలా?

**గురువుగారు :** నీవు పరుపు మీద పడుకొని నిద్రపోతున్నావు... అప్పుడు ఆ పరుపు యొక్క ఉనికి గుర్తు ఉంటుందా? నిద్ర లేచిన తరువాత, "చాలాబాగా నిద్రపట్టింది. ఈ పరుపు చాలా బాగుంది" అని నువ్వంటే అనవచ్చు కానీ నిద్రపోతున్నపుడు ఆ పరుపు యొక్క ఉనికిగాని, అది అక్కడున్న సంగతిగాని నీకు తెలుస్తుందా? తెలియదు. కానీ నువ్వు దానిని వాడుకొంటున్నావు. ఆ పరుపు లేకపోతే నీకు సరిగా నిద్రపట్టుండక పోవచ్చు. పరుపుగా ఉపయోగించడం వల్ల వచ్చే ఫలితాన్ని తెలుసుకోవాలంటే దానిని పరుపుగా వాడుకోవాలి. నువ్వు దానిని డైనింగ్ టేబుల్‌లాగా భోజనం చేయడానికి వాడుకుంటే దాని విషయం నీకు తెలియకపోవచ్చు (గురువుగారు నవ్వుతూ...) దానిని పరుపుగా వాడుకొని ఆ ఫలితాన్ని పొందడమే దానిని సరిగా ఉపయోగించుకోవడమంటే. అదే మీరు చెయ్యాల్సింది. ఇంకో రకంగా చెప్పాలంటే, పరుపు యొక్క ప్రయోజనాన్ని గుర్తించగలిగే సున్నితత్వం నీలో ఎంతగా పెరిగితే, దాని ఉనికి అంతగా ఎఱుకలోకి వస్తుంది, నీకు దాని ప్రయోజనం ఇంకా చాలా స్పష్టంగా తెలుస్తుంది. అసలు విషయమేమిటంటే, చాలా మందికి అంతటి సున్నితత్వం ఉండదు. ఉదాహరణకు మన మనస్సు బస్సు క్లీనరు వంటి మీద ఉండే గుడ్డల్లాగా ఉంటుంది. బస్సుల్లో, లారీల్లో డ్రైవరు, క్లీనరు ఉంటారు – క్లీనరు డ్రైవరుకు చేదోడువాదోడుగా ఉంటాడు. ఆ క్లీనరు గుడ్డలు ఆయిలు, మురికి, మట్టిలాంటివంతా



చేరి ఎంతగా మాసిపోయి ఉంటాయో చూడండి! అటువంటి క్లీనరు వచ్చి ఈ నేల మీద కూర్చున్నాడనుకోండి అతని బట్టలకు మరకలంటుకొని మాసిపోతాయా? ఒకవేళ మురికంటూ అంటుకుంటే అది నేలకే. కొంతమంది మనస్సులు క్లీనరు గుడ్డల్లాగా ఉంటాయి, వాళ్లు ఎక్కడికి వెళ్లినాసరే – అది మురికిలోనికైనా సరే వాళ్లకది మురికిలాగా అనిపించదు. కానీ మీరు చాలా చాలా పరిశుభ్రంగా ఉన్న స్వచ్ఛమైన తెల్లని బట్టలు వేసుకున్నారనుకోండి, మురికి అంటుతుందేమోనని చాలా జాగ్రత్తగా ఉంటారు. శుభ్రమైన నేలమీద కూర్చున్నా బట్టలు మాసిపోతాయోమోనని చాలా భయపడుతుంటారు. కాబట్టి **మన మనస్సులు పరిశుద్ధమయ్యే కొద్దీ, ప్రతి విషయం మన మీద చూపే ప్రభావాన్ని గుర్తించడం మొదలుపెడతాం.** ఇదే విధంగా, మీరు ఆ సన్నిధిలోకి వెళ్లగానే ఆ సాన్నిధ్య ప్రభావాన్ని గుర్తించగలరు, స్పష్టంగా తెలుసుకోగలరు. అది అంత సూక్ష్మమైనదేమీ కాదు, మీరు దానిని తెలుసుకోవచ్చు, అనుభూతి చెందవచ్చు, మీరు దానిని తాకవచ్చు, అవగాహన చేసుకోవచ్చు, దానిని తిని జీర్ణించుకోవచ్చు.

**గురువుగారు :** ఏ పవిత్రక్షేత్రమైనా మహాత్ముల వలనే ఆ పవిత్రతను సంతరించుకుంటుంది. చాలాకాలం క్రితం – చరిత్రకందనంతటి పూర్వకాలంలో – ఇక్కడ అరుణాచలంలో చాలా గొప్ప సిద్ధపురుషుడు ఉండేవారు. ఆయనను ఇక్కడి ప్రజలు శివుని అవతారంగా, శివస్వరూపంగా భావించేవారు, ఆయన ఇక్కడే నివసించారు, ఇక్కడే సమాధి చెందారు. అప్పటి నుండి చాలామంది ఈ పర్వతాన్ని తపోక్షేత్రంగా (సాధనకు అనుకూలమైన పవిత్ర ప్రదేశంగా) భావిస్తారు, ముఖ్యంగా శేషాద్రిస్వామి, రమణమహర్షి కాలం నుండి (ఈ భావన విస్తృతమైంది). కాబట్టి ఇది మహాత్ముల స్థానం.

నా వరకు నాకు, నేను బాబా సమాధిని ఎలా చూస్తానో అలానే అరుణాచలాన్నీ ఒక సమాధిస్థానంగానే చూస్తాను. అరుణాచల పురాణంలో చెప్పింది ఇదే. అందులో ఆ మహాత్ముణ్ణి **'అరుణగిరి యోగి'** అన్నారు. ఒక మహాయోగి ఇక్కడ నివసించారు, ఆయన సమాధి కొండ ఉత్తర శిఖరంపైన ఉంది. రమణమహర్షి కూడా ఒకసారి, ఆయన సమాధి దగ్గర ఉన్న చెట్టును చూసారు. కానీ ఆయన దాని దగ్గరకు వెళ్లలేకపోయారు. తమకు అనుమతి లేదని ఆయనే చెప్పారు – రమణమహర్షికే అనుమతి లేదు! అరుణగిరి యోగివల్ల ఈ పర్వతం పవిత్రమైన కొండగా మారింది. ఆయన సమాధిని చేరుకోవడం దుర్లభం కావడంతో అందరూ అక్కడదాకా వెళ్లి పూజలు, ప్రదక్షిణలు చెయ్యలేరు కాబట్టి, ఈ పర్వతమంతా ఆయన సమాధిగా మారింది. శిరిడీలో మనం సమాధి మందిరాన్ని, గురుస్థానాన్ని, ద్వారకామాయిని కలిపి మహాప్రదక్షిణ చేసినట్లే అరుణగిరికి ప్రదక్షిణ చేయడం జరుగుతోంది. ఆయన సమాధిని దర్శించడానికి కొండనెక్కి వెళ్లలేరు కాబట్టి, ఈ పర్వతాన్నంతా ఆయన సమాధిగా చూస్తూ పర్వతమంతటికీ ప్రదక్షిణలు చేస్తున్నారు.

**భక్తుడు :** పవిత్రస్థానాలన్నీ అక్కడ నివసించిన మహాత్ముల మూలంగా మరింత శక్తివంతంగా తయారవుతాయా? లేక వాటికవే పవిత్రతను కలిగివుంటాయా?



**గురువుగారు :** నిజంగా చూస్తే ప్రతి ప్రదేశమూ పవిత్రమైనదే. అపవిత్రస్థానమంటూ ఏమీ లేదు. కానీ మహాత్ముని సన్నిధి వలన కొన్ని ప్రదేశాలలో మిగతావాటికన్నా ఆ పవిత్రత మరింతగా వ్యక్తమవుతుంది. అందుకని వీటిని పవిత్రస్థానాలు అంటారు.

**భక్తుడు :** అరుణగిరి యోగి ద్వారా ఆకర్షింపబడి తరువాతి కాలంలో వచ్చిన మహాత్ముల వలన, యోగుల వలన ఆ పవిత్రత మరింతగా పెరుగుతుందా?

**గురువుగారు :** అవును, చాలా చాలా మార్గాలు ఏర్పడుతాయి కాబట్టి పవిత్రత పెరుగుతుంది. శేషాద్రిస్వామి ఇక్కడకు వచ్చినపుడు అది పెరిగింది. కొంతమంది ఆయన సన్నిధితో, మహిమతో అనుసంధానం కాగలిగారు. అటువంటి వాతావరణం వలన లబ్ధి పొందారు. రమణమహర్షి వచ్చిన తరువాత వారు మరొక మార్గమయ్యారు. కాబట్టి ఎక్కువ మంది అనుసంధానం కాగలిగారు. – ఆ క్షేత్రం మరింత శక్తివంతమయ్యిందని కాదు – ఎక్కువమంది దానితో బంధమేర్పరచుకోగలిగారు. మామూలు ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అయిందన్నమాట. అంతే! అంతకుముందు కేవలం కొన్ని ప్రత్యేక రోగాలు గలవారు, లేదా కొన్ని రకాలైన జబ్బులతో బాధపడేవారు మాత్రమే వెళ్లేవారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అయితే ఎటువంటి రోగానికైనా వైద్యం చేస్తారు. అలా కొన్ని పవిత్రక్షేత్రాలు అరుణాచలంలాగా సూపర్‌స్పెషాలిటీ ఆధ్యాత్మిక కేంద్రాల్లాగా మారుతాయి.

**గురువుగారు :** ఇక్కడ మరో విషయముంది. పవిత్ర క్షేత్రాలలో రమణమహర్షి వంటి గొప్ప సద్గురువుల సాన్నిధ్యంలో చేసిన సాధన పదింతల ఫలితమిస్తుందని గొప్ప మహాత్ములు చెప్పారు. **"మీరు నాకు ఒక్క రూపాయి ఇస్తే నేను పది రూపాయలు ఇస్తాను"** అని బాబా చెప్పిందీ అదే. అక్కడంతటి ప్రభావం, మహిమ ఉండటంచేత అటువంటి పవిత్రస్థానాలను తపోక్షేత్రాలు అంటారు. వారి సాన్నిధ్యంలో మీరు పూర్తిగా వారి ప్రభావంలో, వారి శక్తి పరిధిలో ఉంటారు. ఇక్కడ మీరు ఓ విషయం గుర్తుపెట్టుకోవాలి. మీరు మంచిపని చేస్తే దాని ఫలితం పదింతలుగా ఉంటుంది. అలా కాకుండా మంచిని దూరం చేసే పనులు చేస్తే దాని ఫలితమూ పదింతలుంటుంది. మీరు ఆధ్యాత్మిక ప్రదేశాలలో వ్యాపారస్తులను చూస్తుంటారు, వాళ్లకు మామూలు వ్యాపారస్తుల కన్నా ఎక్కువ వ్యాపారధోరణి ఉంటుంది – ఎందుకంటే ఆ క్షేత్ర ప్రభావం వలన ఆ వ్యాపారధోరణి పదిరెట్లు, వందరెట్లు ఎక్కువగా ఉంటుంది (నవ్వులు). అక్కడ ఎంత ప్రయోజనముందో అంత ప్రమాదమూ ఉంది. అందుకనే మనం ఆ ప్రయోజనాన్ని ఉపయోగపెట్టుకోవాలి, అంతేకాకుండా మనం అంతే జాగ్రత్తగానూ ఉండాలి – అది కత్తిమీద సాము లాంటిది. మనం ఎప్పుడూ గొప్ప మహాత్ముల సాన్నిధ్యంలో ఉన్నామన్న విషయం గుర్తుంచుకోవాలి. మంచి పని చేస్తే ఫలితం వందరెట్లు ఉంటుంది. తప్పుడు పనిచేస్తే దానికి సంబంధించిన చెడుకర్మ కూడా వందరెట్లుగానే ఉంటుంది. ఎందుకంటే అది ఇక్కడ క్షేత్ర ధర్మం. మీరు ఏం చేసినా సరే దాని ఫలితం వంద రెట్లు ఉంటుంది. వారి సాన్నిధ్యం (మంచి



చెడుల మధ్య) ఎటువంటి తారతమ్యాన్నీ చూపదు.

**భక్తుడు :** గురువుగారూ! పూండీకి వెళ్లడం యొక్క ప్రయోజనమేమిటి?

**గురువుగారు :** పూండీస్వామి సన్నిధిలో ఉండటం కోసమే. మన మనస్సులు ఆవు నుండి తీసిన పాలు అనుకుందాం. వాటిని కాయడానికి మీరు వాటిని స్టవ్ మీద పెడతారు. పూండీ, శిరిడీ నాకు దొరికిన రెండు మంచి స్టవ్‌లు. పాలు కాయాలంటే మనం వాటిని స్టవ్ మీద పెట్టాల్సిందే, అంతేగాని స్టవ్ దగ్గరగానో, స్టవ్ ప్రక్కనో పెట్టకూడదు. స్టవ్ మీద పెట్టాలి. ఆ పాలను (మన మనస్సును) మరిగించినప్పుడు, ఆ 'మరగడాన్ని' మీరు 'ఆనందంగా' అనుభూతి చెందుతారు. అది పొంగిపోయి మీ మనస్సు సంతృప్తి చెందుతుంది. స్టవ్ వెలుగుతోంది – అందుకని ఎంతగా వీలైతే అంతసేపు అక్కడకు వెళ్లి కూర్చోండి, ఆ జ్వాలకు దగ్గరగా మిమ్మల్ని ఎంత వీలైతే అంతసేపు ఉంచుకోండి. లేకపోతే పాలు విరిగిపోయి, పులిసిపోయి దానిని కనీసం కుక్కలు కూడా ముట్టుకోవు – అవి కూడా పారిపోతాయి.

**గురువుగారు :** మనం ఇక్కడ శిరిడీలో ఉన్నామనంటే, అది మన ప్రేమవల్లనేనని, మన ఇచ్ఛానుసారమేనని మనకు తెలుసు, మనకు ప్రియమైన సద్గురువు ఇక్కడ ఉన్నారు, మనకు ఆ ఎఱుక ఉంది, మనం ఆ ఎఱుకను నిలుపుకోవాలనుకుంటున్నాము, అలా ఎఱుకలో ఉండడం చాలా అద్భుతంగా ఉంది, అయినప్పటికీ మనం ఆ ఎఱుకను నిలుపుకోలేకపోతున్నాము, నేను మీకు ఆ ఎఱుక ఉంటే చాలు అంటాను. మీరు నా దగ్గరకు వచ్చి, "మేము ఇక్కడ ఏం చేయాలి, మాకు ధ్యానం చేసుకోవడానికి 'నేనెవరు?', 'మీరెవరు?' లాంటి పద్ధతులేమైనా ఉన్నాయా?" (నవ్వులు) అని అడుగుతుంటారు. మీరు చెయ్యగలిగిందేమీ లేదని నేను చెప్తాను. అదెలా ఉంటుందంటే తడిగుడ్డలాంటి మీరు ఎండలో ఉండటంలా అన్నమాట. బాబా అనుగ్రహం సూర్యుని వేడిమిలాంటిది. మీరు చెయ్యాల్సిందల్లా మీ గుడ్డను (మనస్సును) ఆ ఎండలో ఉంచడమే. దానివల్ల మన అజ్ఞానం అనుకునే తడి ఆరిపోతుంది. అక్కడ గుడ్డ చెయ్యాల్సిందేమీ లేదు. అది చెయ్యాల్సిందంతా ఒక్కటే. తనను తాను ఆ ఎండలో ఉంచుకోవడమే. వాస్తవానికి జరిగేది ఇదే, కానీ సమస్యేమిటంటే, గుడ్డ తనను తాను ఎప్పుడూ ఎండలో ఉంచుకోవడం లేదు. తనను తాను నీడలో ఉంచుకోవాలనుకుంటోంది. లేదా సగం ఆరిన తరువాత కూడా మళ్లీ బక్కెట్‌లోకి వెళుతోంది! (నవ్వులు)

**భక్తుడు :** మమ్మల్ని మేము బయట ఎండలో దండెం మీద వేసుకొని ఉంచుకోవడానికి ఉత్తమమైన మార్గం ఏమిటి?

**గురువుగారు :** ప్రతి ఒక్కరూ ఎవరికి వారు దీని గురించి అన్వేషించాలి. మీరే స్వయంగా ఆ మెళకువలను తెలుసుకోవాలి. ఆ పద్ధతులకు మీరే సృష్టికర్తలు, అన్వేషకులు, బోధకులు కావాలి. మీకు దానికి సంబంధించిన గమనింపు ఉంటే అది తెలుస్తుంది. ఇలా చెయ్యడానికి ప్రతి ఒక్కరికీ సామర్థ్యముంది. కానీ చివరగా మీరు చెయ్యగలిగిందంటూ ఏమీ లేదు – ఎండిపోవడమనే ఆ చివరి చర్య సూర్యుని వల్లనే జరుగుతుంది. మీకై



**ఆరోగ్యం చెడిపోతే కంగారుపడే వారున్నారు కాని,**



మీరు ఆ పని చెయ్యలేరు. కానీ మిమ్మల్ని మీరు ఎండలో ఉంచుకోవచ్చు, మీరు చెయ్యవలసింది చెయ్యగలిగింది అంతే. ఈ సత్సంగాలు, మనం పెట్టుకున్న నియమాలు, ఆధ్యాత్మిక సూత్రాలు, ధార్మిక విధులు... వీటన్నింటి వలన ఏమన్నా జరుగుతుందా అంటే – ఇవన్నీ కూడా దండెం కట్టుకోవడం, మన గుడ్డను ఆ ఎండలో ఆరేసుకోవడం వరకే. ఆ గుడ్డను పొడిగా చేసేది దండెం కాదు సూర్యుడు.

**భక్తుడు** : పద్ధతి వల్ల కాదా!

**గురువుగారు :** సూర్యుడు గుడ్డలు ఆరబెడతాడు. ఆ గుడ్డను ఎంతగా ఎండలో ఉంచుతారో అంత త్వరగా అది ఆరిపోతుంది. దానిని పొడిగా చేయడానికి సూర్యుడు ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. మీరు నీడలో ఉన్నప్పటికీ తన వేడిని ఇవ్వడానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. అంతేకాదు మీరు దానిని నీడలో పెట్టినప్పటికీ కొంతకాలానికి అది పొడిగా తయారవుతుంది, ఇబ్బందేం లేదు, సందేహం అక్కర లేదు. సూర్యుడు ఆ పనిని ఎప్పుడూ చేస్తూనే ఉన్నాడు.

**భక్తుడు** : పూండీలో స్వామివారి సన్నిధిలో నిద్రపోయినా లేదా మేలుకొని ఉండి వారి సమాధికి ప్రదక్షిణలు చేసినా ఎటువంటి తేడా ఉండదా? లేక మేలుకొని ఉండటం వలన ఏమైనా ప్రయోజనం ఉందా?

**గురువుగారు :** ఏం చేసినా అది మంచిదే. ఎవరైనా నన్ను "పూండీకి వెళ్లాల్సిన అవసరం ఏమిటి?" అని అడిగినపుడు నేనిదే చెప్తుంటాను. ఇక్కడ తిరువణ్ణామలైలో నన్ను చాకిరేవు బాధ్యతలు నిర్వర్తించే ఓ చాకలివాడిననుకోండి, సరేనా? ఇది బట్టలుతికే గది – ఇక్కడ కొళాయిలు, సబ్బులు అన్నీ ఉన్నాయి – నేను మిమ్మల్ని ఉతుకుతాను. తరువాత, పూండీలో ఓ దండెం ఉంది– నేనక్కడ మిమ్మల్ని ఆరేస్తాను. ఇక్కడ నేను సర్ఫ్, సబ్బుతో ఉతుకుతాను. కానీ మీరు ఆరాలంటే మిమ్మల్ని అక్కడ దండెం మీద వేయాలి. ఉతికే గదిలో ఉంటే మీరు అంత త్వరగా ఆరిపోవడం జరగదు. బట్టలను రూములో ఉతికినప్పటికీ బయట ఎండలోనే ఆరెయ్యాలి. పూండీలో అందుకోసమనే ఓ దండెం ఉంది, పొడిగా తయారవ్వాలనంటే అక్కడ మీరు ఎండలో కొంతసేపు ఉండాలి (నవ్వులు). మీరు ఎండుతున్నపుడు, మీరు చెయ్యాల్సిందల్లా దండెం మీదనే ఉండటం. అంతే, అదిచాలు. అందుకే నేను, ఒక రకంగా "గ్రుడ్డిగా" అక్కడ దండెం పైనే ఉండండని చెబుతాను.

**భక్తుడు** : అరుణాచలానికి ప్రదక్షిణ చెయ్యడం కూడా అటువంటిదేనా? ప్రదక్షిణ కూడా దండెం మీద ఉండటం వంటిదేనా?

**గురువుగారు :** అవును. అది కూడా అలాంటిదే.

**భక్తుడు** : మేము శిరిడీలో ఉన్నప్పుడు, ప్రతిరోజూ కాసేపు గురుస్థాన్‌లో సమాధి మందిరంలో ఊరికే అలా



కూర్చుంటే సరిపోతుందా?

**గురువుగారు :** మీకది మరీ అంత సులభంగా ఉంటే అలానే చెయ్యండి! అది "సరిపోతుంది", ఈ ప్రశ్నలో "ఇది సరిపోతుందా, లేకపోతే మేము ఇంకా ఏమైనా చెయ్యాల్సి ఉందా?" అన్న సంశయం ధ్వనిస్తోంది. మీరు ఇంకా ఏదైనా చెయ్యగలిగినా ముందు ఇది (గురుస్థాన్‌లో, సమాధి మందిరంలో ఊరకే కూర్చోవడం) చెయ్యండి. అది చాలు.

అదెలా ఉంటుందంటే మీ దుస్తులు ఇక్కడ వాషింగ్‌మెషీన్‌లో ఉతకడం, జాడించడం జరుగుతుంది, అక్కడ మందిరంలో ఆరబెట్టడం జరుగుతుంది. తడిబట్టలను పొడిగా చేయడానికి, ఎండలో వేస్తే చాలు, బట్టలు తాముగా చెయ్యాల్సిందేమీ లేదు. కానీ ముందు వాటిని మురికిపోయేలా ఉతికి జాడించాలి. అప్పుడవి త్వరగా ఆరిపోతాయి. ఇక్కడ సత్సంగంలో ఉతకడం, జాడించడం జరుగుతుంది. ఆరబెట్టడమనేది అక్కడ జరుగుతుంది – ఇది బట్టలుతికేవారి పని! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** మేము ఇక్కడున్నా, లేక వేరొకచోటున్నా ఎటువంటి తేడా లేదని మీరంటారు. కానీ మీరు వేరే సందర్భాలలో మాట్లాడుతూ బట్టలు బయట ఎండలో ఆరేసినపుడు ఇంట్లో కన్నా త్వరగా ఆరిపోతాయని అన్నారు. కాబట్టి ఈ శుభ్రం చేసే విధానం లేదా మేము మీ దగ్గర ఉన్నప్పుడు జరిగేది – అదేదైనా సరే, మేము మీ పదసాన్నిధ్యంలో ఉన్నపుడు త్వరగా జరుగుతుంది కదా?

**గురువుగారు :** నేను మాట్లాడేది ఇవ్వడం గురించి. మీరు నాకు దగ్గరగా ఉన్నప్పుడు సహాయం అనేది మీకు ఎక్కువ గాఢంగా అనుభవమవుతుంది. దూరంగా ఉన్నప్పుడు అది మీకు వేరే రకంగా కాస్త తక్కువ తీవ్రతతో అనుభవం కావచ్చు. అంతేగాని, మీరు ఇక్కడున్నపుడు నేను ఎక్కువ ఇస్తానని కాదు. (నేనివ్వడం అనేది ఎక్కువ, తక్కువలనేది లేకుండా ఎక్కడైనా ఒకేలాగా ఉంటుంది) మీరు ఎక్కువగానో తక్కువగానో అనుభవం చెందితే చెందవచ్చు, నేను ప్రస్తుతం మాట్లాడేది మాత్రం ఇవ్వడం గురించే. అలాగే సూర్యుడు ఎప్పుడూ ప్రకాశిస్తూనే ఉన్నాడు, బట్టలు ఆ వెచ్చదనాన్ని పొందుతూనే ఉన్నాయి.

ద్రవ రూపంలో వున్నపుడు నీటికి, నేతికి రంగులేదు. ఘన రూపంలో మారిన వీటికి రంగు ఏర్పడుతుంది. భక్తుని హృదయంలో ప్రేమ అధికమైతే అఖండాకార నిరాకార పరమాత్మ ఘనీభూతమై ఒక రూపునెత్తి 'గురువుగా' ఆవిర్భవిస్తున్నది. నిరాకారుడు, నిర్గుణుడు, నిరామయుడు, అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుడైన బాబా ఘనీభవించిన రూపం 'బాబూజీ'గా ఆవిర్భవించినది ఈ భూమి మీద. గురువు గూర్చి మాట్లాడటం కోసం విందాం, మనం మారడం కోసం విందాం, అంతేగానీ, కాలక్షేపం కోసం వద్దు. దానికైతే వేరేదాన్ని ఆశ్రయిద్దాం.

**–గురుకృప**

# ఆనంద పారవశ్యం - వ్యక్తీకరణ - నవంబర్ 2012



**గురువుగారు :** అడవిలో సాధువు గురించిన ఒక కథంటే నాకు చాలా ఇష్టం. దాన్ని మీకు నేను చాలాసార్లు సత్సంగాలలో చెప్పానుకదా, మీకది గుర్తుందా?



విష్ణుమూర్తి సాక్షాత్కారం పొందాలని హృదయంలో తపన వున్న ఒక వృద్ధ సాధువు ఉండేవాడు. దాంతో అతను శాస్త్రాలలో చెప్పిన విధంగానే అడవిలోకి వెళ్లి ఓ చెట్టు క్రింద కూర్చుని తపస్సు చెయ్యడం మొదలుపెడతాడు. ఇంద్రియాలను నిగ్రహించి, ఏకాగ్రచిత్తంలో, తదేక దృష్టితో, హఠయోగం, రాజయోగం, ఆత్మవిచారం ఇటువంటివన్నీ చేస్తుంటాడు (గురువుగారు నవ్వుతూ...) చాలా పట్టుదలతో తాను చదివిన వాటిని, విన్నవాటిని అన్నింటినీ చాలా శ్రద్ధగా సాధన చేస్తూ వుంటాడు. ఒకరోజు నాదబ్రహ్మ నారదమహర్షి ఆ త్రోవలో పోతూ ఈ సాధువును చూడటం జరుగుతుంది. ఎందుకనో నారదమహర్షికి అతన్ని చూడగానే అతని పట్ల ఇష్టం కలుగుతుంది. అందుకని ఇతని దగ్గరకు వచ్చి "నాయనా, ఎవరునువ్వు? ఎక్కడి నుండి వచ్చావు? ఏం చేస్తున్నావు?" అని అడుగుతాడు. నారదుల వంటి మహర్షుల దర్శనభాగ్యం కలిగినందుకు ఆ సాధువు చాలా సంతోషించి, తన వివరమంతా నారదమహర్షికి చెప్తాడు. నారదుడు సంతసించి, "మంచిది, నీకేదైనా కోరిక ఉందా?" అని అడుగుతాడు. దానికి సాధువు "ఓ నారదా, నాకేమీ అవసరం లేదు. కానీ నాది ఒకే ఒక విన్నపం. మహర్షీ, మీరు ఈసారి విష్ణుధామమైన వైకుంఠానికి వెళ్లినపుడు, ఆ స్వామిని నాకు వారు దర్శనాన్ని ఎప్పుడు అనుగ్రహిస్తారో కాస్త కనుక్కొని, తరువాత మీకు వీలైనపుడు నా వద్దకు వచ్చి ఆ సమాధానాన్ని నాకు తెలియచేయవలసింది" అని కోరతాడు. దానికి నారదుడు, "ఆహాఁ దానికేముంది, ఇది చాలా చిన్న విషయం, తప్పకుండా! దీని గురించి ఆందోళన చెందవద్దు, నేను చూసుకుంటాను" అని చెప్పి అక్కడి నుండి వెళ్లిపోతాడు.

కొన్ని సంవత్సరాలు గడిచిపోతాయి. నారదుడు ఈ విషయం పూర్తిగా మరచిపోతాడు. ఆ తర్వాత ఒకసారి నారదుడు వైకుంఠానికి పోవడం తటస్థిస్తుంది. విష్ణుమూర్తితో ఆ మాట ఈ మాట మాట్లాడుతూ ఉన్నపుడు ఉన్నట్టుండి నారదునికి ఈ వృద్ధ సాధువు, అతని ప్రశ్న గుర్తుకొస్తాయి. అప్పుడు నారదుడు



విష్ణుమూర్తిని, "స్వామీ, నేను మిమ్మల్ని ఓ విషయం అడగడం మర్చిపోయాను. చాలా రోజుల క్రితం నేను దీనుడైన ఒక సాధువును కలిశాను. అతను చాలా తీవ్రంగా తపస్సు చేస్తున్నాడు. అతను చాలా శ్రద్ధాశక్తులు ఉన్నవాడు, నాకు చాలా బాగా నచ్చాడు. అతనికి మీరెప్పుడు దర్శనం ఇస్తారో తెలుసుకోవాలనే చిన్న ప్రశ్న ఉంది" అని విన్నవిస్తాడు. దానికి విష్ణుమూర్తి "అయ్యో నారదా, దానికి చాలా కాలం పడుతుంది. అతను కూర్చున్న చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మల తరువాత – అంటే కొన్ని వేల జన్మలు ఎత్తిన తరువాతగాని, అతనికి నేను దర్శనం ఇవ్వడం జరగదు" అంటాడు. అప్పుడు నారదుడు "అయ్యో, అతను చాలా మంచివాడే" అని విచారం వ్యక్తం చేస్తాడు. "ఏం చేస్తాం నారదా, అతని ప్రారబ్ధం అంత ఉంది. నేను చెయ్యగలిగింది ఏమీ లేదు" అంటాడు విష్ణుమూర్తి. "సరే స్వామీ, మీ చిత్తానుసారమే కానివ్వండి" అని చెప్పి నారదుడు బయలుదేరుతాడు.

ఆ తరువాత కొంతకాలానికి నారదుడు అడవిలో ఆ సాధువుకు సమీపంలో అంతకుముందు వెళ్లిన దారిలోనే పోతుంటాడు. నారదుడు ఆ సాధువును చూస్తాడు. అతనికి ఆ దుర్వార్త చెప్పడం ఎందుకని అతన్ని చూసీచూడనట్లు అలా వెళ్లిపోతుంటాడు. కానీ ఆ సాధువు నారదుణ్ణి చూసి పరుగెత్తుకుంటూ వచ్చి "ఇదేమిటి మహర్షీ, నాకు దూరంగా వెళ్లిపోతున్నారు, నేను చేసిన తప్పేమిటి? క్రిందటిసారి నేను అడగకుండానే మీ దర్శనాన్ని ప్రసాదించారు. కానీ ఈ రోజు అసలు నన్ను పట్టించుకోకుండా దూరంగా వెళ్లిపోతున్నారెందుకు?" అని ప్రశ్నిస్తాడు. దానికి నారదుడు "లేదు, అటువంటిదేం లేదు, నీ పట్ల నాకు కోపమేమీ లేదు. కాస్త తీరుబడి లేదు, అంతే. ఏంటి ఎలా ఉన్నావు? అంతా బాగుందా?" అని అడుగుతాడు. "అంతా బాగానే ఉంది స్వామీ! మరి నా ప్రశ్న ఏమైంది స్వామీ" అని విషయానికి వస్తాడు ఆ సాధువు. అప్పుడు నారదుడు, "దాని గురించి ఆందోళపడవద్దు. నువ్వు సరిగ్గానే చేసుకుంటున్నావు. అలాగే చేసుకుంటూ ముందుకెళ్లు, విష్ణుమూర్తి నిన్ను తప్పక అనుగ్రహిస్తాడు – ఆయన అనుగ్రహం ఎప్పుడూ నీతోనే ఉంది. నువ్వు బాగా చేసుకుంటున్నావు. ఇలాగే చేసుకో" అని అంటాడు. అయితే ఆ సాధువు, "మహర్షీ మీరు నా ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందే" అని ఆ సాధువు పట్టుబడతాడు. విష్ణుమూర్తి చెప్పిన దానిని అతనికి చెప్పి నిరుత్సాహపరచడం ఇష్టంలేక నారదుడు మళ్లీ "దాని గురించి ఆలోచించవద్దు, ఇలాగే చేసుకుంటూ ముందుకెళ్లు" అని తప్పించుకోజూసాడు. కానీ ఆ సాధువు ఎంతకీ పట్టు వదలకపోయేటప్పటికి ఇక నారదునికి విషయం చెప్పక తప్పదు. నారదుడు అతనితో, "నేనేం చెప్పేది నాయనా, నువ్వు కూర్చున్న ఈ చెట్టుకు ఎన్ని ఆకులున్నాయో అన్ని జన్మలెత్తిన తరువాతగానీ నీకు సాక్షాత్కారం లభించదని విష్ణుమూర్తి చెప్పాడు" అని చెప్తాడు.

ఇలా ఈ విషయం అతనికి చెబుతున్నపుడు నారదుడు మనస్సులో, "భగవంతుడా, ఈ విషయం వినగానే ఇతని గుండె బ్రద్దలైపోతుంది" అనుకుంటాడు. కానీ అత్యంత ఆశ్చర్యం గొలిపేలా, ఆ సాధువు



ఈ విషయం వినీవినగానే చెప్పరాని ఆనందంతో, పారవశ్యంతో పెద్దగా, "ఆహా, నాకెంతో ఆనందంగా వుంది. విష్ణుమూర్తి నాకు సాక్షాత్కరిస్తానని హామీ ఇచ్చారు, నాకు స్వామి దర్శనాన్ని అనుగ్రహించబోతున్నారు" అని అరుస్తూ ఆనందంగా నృత్యం చేయడం మొదలుపెడతాడు.

అతను అలా నాట్యం చేస్తున్నపుడే, అదే క్షణంలో వైకుంఠం నుండి విష్ణుమూర్తి వచ్చి అతనికి దర్శనం ఇస్తాడు. ఈ పరిణామంతో నారదుడు మరింత ఆశ్చర్యపడంతోపాటు చిన్నబుచ్చుకుంటాడు (గురువుగారు నవ్వుతూ) విష్ణుమూర్తి ఆ సాధువుకు దర్శనం ఇవ్వాలని నారదుడు మనస్ఫూర్తిగా కోరుకున్నాడు, కారీ కొన్ని వేల జన్మల తరువాతగాని అది సాధ్యం కాదన్న విషయం అతనికి చెప్పిన తరువాత అప్పటికప్పుడు విష్ణుమూర్తి అతనికి దర్శనం ఇవ్వడంతో నారదుడు తాను వెర్రివాడినైపోయానని అనుకున్నాడు (గురువుగారు నవ్వుతూ)

ఆ తరువాత నారదుడు, విష్ణుమూర్తి కలసి అక్కడినుండి బయలుదేరి వెళుతున్నపుడు నారదుడు తట్టుకోలేక విష్ణుమూర్తితో "స్వామీ! మీరు చేసిందేమిటి? ఆ సాధువు ముందు నన్ను వెర్రివాణ్ణి చేసారు. ముందు మీరే కొన్ని వేల జన్మల తరువాతగానీ అతనికి దర్శనం ఇవ్వనని చెప్పారు, నేనతనికి అదే చెప్పాను. ఉన్నట్లుండి మీరు అతనికి సాక్షాత్కరించారు. అతడు నా గురించి ఏమనుకుంటాడు" అని మొరపెట్టుకుంటాడు (గురువుగారు నవ్వుతూ) దానికి విష్ణుమూర్తి "నారదా నేనేం చేసేది, అతని ప్రారబ్ధానుసారం నేను అతనికి సాక్షాత్కరించడానికి అతను చాలా జన్మలు ఎత్తవలసి ఉంది. కానీ నువ్వు అతనికి అన్ని జన్మల తరువాతైనా నేను దర్శనం ఇస్తాను అని చెప్పిన మరుక్షణం, నా సాక్షాత్కారం లభిస్తుంది అన్న హామీ అతనికి ఎంతో ఆనందాన్ని కలిగించింది. ఆ పారవశ్య స్థితిలో ఎన్నో జన్మల ప్రారబ్ధ కర్మ దహించుకుపోయింది. అతను (దర్శనానికి) సంసిద్ధుడయ్యాడు – అందుకనే నేను తక్షణం సాక్షాత్కరించవలసి వచ్చింది. అది నా చేతులలో లేదు, నేనేం చేసేది? (గురువుగారు నవ్వుతూ...) "నేను నిన్ను వెర్రివాడిని చేయాలనుకోలేదు, అదలా జరిగిపోయింది. నేను చేయగలిగింది ఏమీ లేదు" అని వివరిస్తాడు.

చూడండి! దాసగణు మహరాజ్ – కాకాసాహెబ్ దీక్షిత్ పనిపిల్ల పెట్టెలోని చీర గురించిన కథలోను, ఈశావాస్యోపనిషత్తులోనూ చెప్పినదానిలో అసలు ఉద్దేశ్యం ఇదే. పెట్టెలో ఉన్న చీరలాంటిదే. ఈ కథలో సాక్షాత్కారానికి సంబంధించిన హామీ. దీనిని రెండు రకాలుగా తీసుకోవచ్చు. సాధారణంగా అందరూ, "ఓరి భగవంతుడా, నాకు విష్ణుమూర్తి అనుగ్రహం అసలు లేనే లేదు – వెయ్యి జన్మలు ఎత్తాలా? అదేమి ప్రేమ (నవ్వులు) అన్ని జన్మలు ఎత్తాలా? – ఆ కర్మనంతా ఆయనే భస్మం చేయలేరా? ఆయనకు ఆ శక్తి లేదా?" అనుకుంటారు (గురువుగారు నవ్వుతూ) కానీ దీనికి బదులు ఆ సాధువు ఎంతో సానుకూల



వైఖరితో ప్రతిస్పందించి, "ఆయన నాకు సాక్షాత్కారమిస్తాడు, ఆహాఁ, నాకు ఎంతో సంతోషంగా ఉంది" అని ఆనందాతిశయంతో కేకలు వేశాడు.

ఆ ఆనంద పారవశ్యం, సానుకూల దృక్పథం (Positive Attitude) అనేవి సాక్షాత్కారానికి కీలకం. అందుకనే ఎవరైనా "అన్ని జన్మలు ఎందుకు పడుతుంది? ఈ ప్రక్రియ అంత సుదీర్ఘంగా ఎందుకు సాగుతుంది?" అని అడిగితే – దానికి సమాధానం ఉండదు. అది ఈ క్షణంలో జరగవచ్చు లేదు ఎన్నటికీ జరగకపోవచ్చు. "ఎంతకాలం?" అనేది అర్థంలేని ప్రశ్న. నీకెంత తపన ఉందో అంత కాలం. కాబట్టి 'ఎంత కాలం' అనేదానికి 'నీకెంత ఎక్కువ తపన ఉందో అంత త్వరగా' అనేదే సమాధానం. అదెంత కాలం అంటే నీ తపన ఎంత గాఢమైనదైతే అంత తక్కువ కాలం.

ఇది చాల మంచి కథ. ఇది కొన్ని వందల, వేల విషయాలను తెలియచేస్తుంది. ఈ ఒక్క కథ నాకు ఎన్నో శాస్త్రాలతో సరి సమానం. అది కేవలం కల్పితమే కావచ్చు, కథే కావచ్చు కానీ అదేం పట్టించుకోనక్కరలేదు. నాకు ఎన్నో శాస్త్రాల సారాన్ని ఈ కథ తెలియచేస్తుంది.

**భక్తుడు** : గురువుగారూ, మనం మన లక్ష్యాన్ని చేరుకున్న తరువాత ఆ తపన అంతరిస్తుందా?

**గురువుగారు :** ఒక రకంగా చెప్పాలంటే అది నిజమే. కానీ నేను మీకు చెప్పినట్టు అది అంతమాత్రమే కాదు. అందుకనే మీరు చూస్తే రమణమహర్షి కూడా ఆ తపనను వ్యక్తం చేయడం కనిపిస్తుంది. గోపికలు సైతం అటువంటి పరితాపాన్ని చూపించడం చూడవచ్చు. మరి అది ఎటువంటి తపన? బాబా కూడా ఎడబాటును వ్యక్తం చేసే గీతాలను ఆలపిస్తూ, ఆ పరితాపాన్ని వ్యక్తం చేస్తూ నృత్యం చేసేవారు, కొన్ని కబీరు గీతాలు రామునికోసం, రామదర్శనం కోసం కబీరు పడే వేదనను తెలియచేస్తాయి. అలాగని బాబాగాని, కబీరుగాని వారి లక్ష్యాన్ని చేరుకోలేదనగలమా? వారి తపన పరిపూర్ణంగా తీరింది. కానీ దానిని ఇంకా వాళ్లు ఇలానే వ్యక్తం చేయాలనుకున్నారు. ఈ రకంగా వ్యక్తం చేయడం కూడా తపించడమే కానీ అది మరో రకమైన తపన.

**భక్తుడు** : గురువుగారూ! మీరాబాయి, రవిదాసు మొదలైన మహాత్ములు కూడా తమ ఆరాధ్యదైవంతో తమ ఎడబాటును, వియోగాన్ని వ్యక్తం చేసే గీతాలు రచించారని మనకు తెలుసు. వారి అనుభవంలో ఏదైనా సారూప్యత ఉందా?

**గురువుగారు :** అవును, సారూప్యం ఉంది. అది కేవలం వియోగం వలన కలిగిన వేదన మాత్రమే కాదు. దానిలో ఇంకా వేరేదేదో ఉంది. అందులో ఆనందం ఉంది. అది ఆనందాన్నిచ్చే వియోగం. అది వియోగంగా వ్యక్తం చేయబడిన సంయోగానుభూతి.

**భక్తుడు** : గురువుగారూ! పరిపూర్ణమైన ఆనందానికి అంతమంటూ లేదా? లక్ష్యాన్ని చేరుకున్నాక కూడా ఇంకా ఇంకా ఆ ఆనందం కోసం తపన ఉంటుందా?



**గురువుగారు :** అవును, దాన్ని ఇంకా ఇంకా పొందాలని తపన ఉంటుంది. ఈ మొత్తం మార్గం కూడా ఆనందమయం కావాలి. అదే నేను చెప్పేది. ఎవరైన ఊరికే చిటచిటలాడుతూ, ధుమధుమలాడుతూ ఉంటే వాళ్లు సరైన మార్గంలో లేరని అర్థం.

**భక్తుడు :** ఆ తపనలో కొన్నిసార్లు ఒక రకమైన వేదన ఉంటుంది కదా?

**గురువుగారు :** నేను దానిని వేదన అని అనను. కొన్నిసార్లు వారి పరితాపం మనకు యాతనలాగా కనిపించవచ్చు. కానీ నిజానికది యాతన కాదు. అందులో పారవశ్యమైన ఆనందం కూడా ఉంది. నేను ఈ విషయం గురించి, నిజమైన యాతనకు, ఇటువంటి పరితాపానికి గల తేడాను గురించి, ఇటువంటి తపన అద్భుతమైన కవిత్వానికి ఎలా దారితీస్తుందోనన్న విషయం గురించి ఇంతకుముందు చాలాసార్లు వివరించాననుకుంటాను.

అరుణాచలేశ్వరునితో తమ ఏకత్వం యొక్క ఆనందానుభూతిని వర్ణించడానికి రమణులు అరుణాచలపదికాన్ని రచించారు. మీరు దానిని చదివితే అది ఆయన పరితాపాన్ని, ఎడబాటును తెలియచేస్తుంది. కానీ నిజంగా ఆయన అరుణాచలేశ్వరుని (తమ ఆత్మ) నుండి వేరుగా ఉన్నారా? లేదు. ఆ ఏకాత్మక స్థితిని వర్ణించడం వీలుకాదు కాబట్టి రమణులు తమ ఏకత్వానుభూతిని వర్ణించడానికి అరుణా చలేశ్వరునితో ఎడబాటును వ్యక్తపరచడమనే ఒక మార్గాన్ని ఎంచుకున్నారు. కాబట్టి ఆ సంయోగానుభూతి వియోగరూపంలో వ్యక్తం చేయబడింది. వేరువేరుగా ఉన్నప్పుడే ఏకత్వ భావన కలుగుతుంది. ఇద్దరు విడివిడిగా ఉన్నప్పుడే మాటలుంటాయి. ఆయన ఆ ఎడబాటు వలన కలిగిన పరితాపాన్ని, వేదనను, కష్టాన్ని వ్యక్తం చేసారు. అప్పుడే మీరు ఏకత్వంలోని ఆనందాన్ని ఊహించగలరు. అది ఎలా ఉంటుందంటే, మూడు రోజులపాటు ఆకలితో అలమటించి (ఆహారం తీసుకున్న తరువాత) ఆకలి గురించి వివరించినట్లు ఉంటుంది. ఆ తరువాత ఆహారం తీసుకుంటున్నపుడు ముందు మీరు, "అమ్మో, మూడు రోజులపాటు నేను భోజనమే చేయలేదు" అంటారు. అక్కడ చూడండి, మీరు ఇప్పుడు తింటున్న భోజనం గురించి కాకుండా అంతకుముందు మూడురోజులు ఏమీ తినలేదన్న విషయం గురించే ఆలోచిస్తున్నారు. మీరు భోజనాన్ని ఎంతగా ఆస్వాదిస్తున్నారో అనే విషయాన్ని ఆ భోజనం లేకపోతే మీరెంత వేదనను అనుభవించారో చెప్పడం ద్వారా తెలియచేస్తున్నారు. అదే, మీరిప్పుడు భోజనాన్ని ఎంతగా ఆస్వాదిస్తున్నారో అన్న విషయాన్ని తెలియచేస్తుంది.

కాబట్టి ఏకత్వానుభూతిని మాటలతో వర్ణించడం వీలుకాదు. అందుకనే మహాత్ములు, దానిని వర్ణించడం లేదా ఆ ఏకాత్మకతను వివరించడానికి పూనుకోవడంలాంటి పొరపాటు చెయ్యలేదు. దానికి బదులు వాళ్లు ఆ ఎడబాటును, తపనను వర్ణించారు. శ్రీమద్భాగవతంలో కృష్ణునికోసం గోపికలు ఎంతగా పరితపించారో చూడండి. రమణమహర్షి విషయంలో కూడా అరుణాచలేశ్వరుని గురించి ఆయన ఎంతగా



తపించారో గమనించండి. కబీరు తమ సద్గురువు కోసం లేదా రామునికోసం తమ తపన గురించి రచించిన గీతాలను బాబా కూడా ఆలపించేవారు. ఆ ఏకత్వాన్ని వర్ణించాలంటే ఇదొక్కటే మార్గం ఎందుకంటే ఆ ఏకత్వాన్ని నేరుగా వర్ణించడం సాధ్యం కాదు.

కాబట్టి ఇటువంటి ఎడబాటులో ఆనందం ఉంది. దానిని కవితాత్మకంగా చూడండి. రమణమహర్షి ఆ ఏకత్వాన్ని ఎడబాటు రూపంలో వ్యక్తం చేసారు, కారణం ఆయన ఆ ఏకత్వాన్ని అనుభూతి చెందారు. మీరు అటువంటి ఏకత్వం కోసం పరితపిస్తుంటే, మీ లక్ష్యం గురించిన ఆలోచన సైతం మీకు ఆనందాన్నివ్వాలి. ఆ భావన సైతం మీకు ఆనందం కలిగించాలి. దానిని పూర్తిగా పొందలేకపోవడమనేది మన అసంతృప్తికి కారణం. కాబట్టి అక్కడ ఆనందం, విచారం రెండూ ఉన్నాయి. ఇది చాలా విశిష్టమైన విషయం. ప్రేమలోని పరస్పర వైరుధ్యం ఇదే.

**భక్తుడు** : గురువుగారూ, మీరు మాతో ఉన్నపుడు ప్రతి విషయమూ మధురంగా ఉంటుంది. మీరు మాతో లేనపుడు ఆ మాధుర్యాన్ని నిలుపకోవడం ఎలా?

**గురువుగారు :** దానిని నిలుపుకోవడానికి ప్రయత్నించండి. దానిని అంటిపెట్టుకోవడానికి, తిరిగి పొందడానికి ప్రయత్నించండి. మళ్లీ ప్రయత్నించండి, పోరాడండి. అటువంటి సంఘర్షణ ఉండాలి – దానిలో నుండే నిజమైన అనుభవం వస్తుంది. బాబాకు జరిగే కాకడ ఆరతిలో "మీ బుడతో భవ భయ డోహీ ఉద్ధరా" (నేను సంసార సాగరంలో కొట్టుకుపోతున్నాను బాబా, నన్ను ఉద్ధరించండి – కాకడ ఆరతి పద్ XIII) అంటారు. ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్నపుడు మీరు "హాఁ హాఁ హాఁ" అంటూ ఊపిరి కోసం ఎలా అల్లాడిపోతారు? అటువంటి ప్రయత్నం ఉండాలి – అప్పుడు మిమ్మల్ని బాబా బయటపడేస్తారు. అప్పుడు మీకు శ్వాస ఎంత విలువైనదో తెలుస్తుంది. ఇప్పుడు మీరు ఊపిరి తీసుకుంటున్నారు, కానీ కేవలం ఒక్క శ్వాస ఎంత విలువైనదో ఇప్పుడు మీకు తెలియదు, ఇలా కొన్ని లక్షలసార్లు శ్వాస తీసుకొని ఉంటారు. కానీ అలా ప్రవాహంలో కొట్టుకుపోతున్నపుడు మీకు దాని విలువ తెలుస్తుంది. "హమ్మయ్య, భగవంతుడా" అంటారు. అలా మీరు ప్రతి శ్వాసలో ఆ శ్వాస యొక్క విలువను తెలుసుకునేదాకా దానిని మళ్లీ మళ్లీ మరచిపోతుంటారు. మళ్లీ మళ్లీ తెలుసుకుంటూ ఉంటారు. అప్పుడు ప్రతి శ్వాసా ఎంతో విలువైనదిగా తోస్తుంది. అది ఎంత ఆనందంగా, పరవశంగా, ఎంత సంతృప్తిగా ఉంటుంది. అప్పుడు మనం ఆనందాన్ని శ్వాసిస్తాం – ఆనందాన్ని ఉచ్ఛ్వాసిస్తాం, నిశ్వాసిస్తాం – మనం అలా పరివర్తన చెందుతాం.

**భక్తుడు** : గురువుగారూ, మేము బాబా సన్నిధిని అనుభవంలోనికి తెచ్చుకోవాలని తపిస్తుంటాము. బాబా సన్నిధిని ఇంకా ఇంకా అనుభవంలోకి తెచ్చుకోవడం ఎలా?

**గురువుగారు :** బాబా సాన్నిధ్యం మీకు నిజంగా అవసరమైతే ఆయనే ఇస్తారు, ఆయన తమ సాన్నిధ్యాన్ని ఇస్తూనే ఉన్నారు కూడా! ఒక్కసారి మీరు కాస్త గతంలోకి చూస్తే ఆయన సాన్నిధ్యాన్ని మనకు



ప్రసాదించినప్పటికీ మనం ఎలా నిరాకరిస్తామో తెలుస్తుంది. మనం ఒక దాని గురించి అడుగుతాం తీరా అది ఇచ్చినపుడు మనం దానిని గుర్తించం, అందువలన మనం దానిని కోల్పోతాం, కానీ బాబా సన్నిధి ఎప్పుడూ ఉంది.

మీరు నిజంగా నిజాయితీగా, హృదయపూర్వకంగా, చిత్తశుద్ధితో బాబా సన్నిధిని కోరుకుంటే – ఆయనను పిలవండి! దానికి అదొక్కటే మార్గం. పిలవండి, పిలవండి, పిలవండి! అప్పుడు ఆ సన్నిధి మీకు లభిస్తుంది. క్రిందటిసారి నేను దీనిని మీకు చెప్పినప్పటి నుండి, మీరు ఎన్ని గంటల పాటు అలా కూర్చుని బాబాను పిలిచారు? మీ స్థానంలో నేను గనుక ఉంటే కనీసం 8 నుండి 10 గంటల పాటు కూర్చుని అలా పిలుస్తూ, పిలుస్తూ, పిలుస్తూ ఉండేవాడిని. **"బాబాను పిలవమని, పిలిస్తే బాబా ఇస్తారని గురువుగారు చెప్పారు, ఆయన ఆ హామీ ఇచ్చారు, కానివ్వండి, చేసి చూద్దాం"**... ఇలా ఆ తపనను పెరగనివ్వండి, కోరికను పెరగనివ్వండి, మన తపనకు, ఆనందానికి మధ్యలో వచ్చే అడ్డంకులను తొలగిపోనివ్వండి. అప్పుడు మీరు దానిని పొందుతారు. **"నేను చెబుతున్నాను కదా, బాబా ఎవ్వరినీ వదిలిపెట్టరు, ఎవ్వరూ వట్టి చేతులతో తిరిగి వెళ్లరు".**

## ఆ అడగడం నేర్పుతే సాయిపథం

ఒకాయనకు దేవుడు కలలో కనపడి ఏం కావాలో కోరుకో అంటే, నాకు పుట్టే పిల్లలకు మెల్లకన్నుండేలా చూడు అన్నాడట. మెల్లకన్నుతో పుట్టే పిల్లలు భాగ్యవంతులవుతారని ఎవరో చెప్పగా విన్నాడు. (మెల్లకన్ను వున్నవాడు అదృష్టవంతుడు అన్నది సామెత. ఈ సామెత కన్ను గ్రుడ్డిది కాకుండా... కనీసం మెల్లయినా – దృష్టి అంటూ ఉంటుందన్న ఆశతో మాత్రమే). ఆ మాట మీద బాగా గురి కుదిరింది. అప్పటి నుండి ఆయన దృష్టి భాగ్యంపై కాకుండా మెల్లపై లగ్నం అయింది. అనుకోకుండా దేవుడు ప్రత్యక్షమై అడిగేసరికి ఇంకేం ఆలోచించకుండా పిల్లలకు మెల్లకళ్లు అడిగాడు. దేశాన్ని పాలించే రాజు వచ్చి ఏం కావాలని అడిగితే 'నశ్యం డబ్బా' అడిగాడట – 'నశ్యం' పట్ల ఇష్టం కలిగిన వ్యక్తి. భగవంతుడు ఎదురై – పనిపిల్లని ఏం కావాలని అడిగితే 'అరగనిచీపురు' అడిగిందట. మనం సద్గురువును ఉపయోగ పెట్టుకొనే విధానం కూడా ఇలాగే ఉందేమో గమనించుకుందాం. సాధ్యాసాధ్యమన్న అంశమే లేని సద్గురు సన్నిధానంలో మనం ఏం ఆశిస్తున్నాం. దైవమే దివి నుంచి భువికి వస్తే మనం మాత్రం ఆయన అడిగిన ఒక్క అడుగు తనవైపుకు వేయడానికి సందేహిస్తాం. అన్నీ ఉన్నా ఇంకా ఏదో సంపాదించాలన్న తపనే. అవసరమైనవన్నీ అందిస్తున్నా కోరికల నిచ్చెనలో చివరిమెట్టుకు చేరాలన్న అత్యాశే! కొన్ని లక్షల జీవరాశు ల్లో వివేకము, విచక్షణ, కలిగిన మానవ జన్మను సార్థకం చేసుకోవాలంటే మనం 'అడగడం' నేర్చుకోవాల్సిందే. ఆ 'అడగడం నేర్పే' సన్నిధానమే సద్గురు సన్నిధానం.

**మంత్ర ప్రమేయం లేని దివ్య ఔషధం - విశ్వాసం**



పిల్లవాడికి చాక్లెట్, వెయ్యి రూపాయలు చూపి ఏది కావాలంటే చాక్లెట్ తీసుకున్నట్లే ఉంటుంది. వెయ్యి రూపాయల విలువ తెలిస్తే దానితో తాను ఇష్టపడే చాక్లెట్లు ఎన్ని కొనుక్కోవచ్చో తెలియకపోవడం వలననే చిన్నారి చాక్లెట్‌నే కోరుకుంటున్నది. ఇట్లా చిన్న పిల్లాడిలా ప్రవర్తించే మనస్తత్వమే మనది. పై మాటలు వింటే మనల్ని చూసి మనకు జాలి వెయ్యక మానదు. మనలో ఎక్కువ మంది అలానే ఉన్నాం. మన నడవడి, ప్రవర్తనను సరిదిద్ది సత్యపథంలో, ఋజుమార్గంలో పయనింపచేయాలన్న తపనతోనే "ఎందుకు ఈ జన్మలోకి వచ్చింది...." అంటూ ప్రశ్నించి, "గురువును తెలుసుకో.... గురువుకు పగ్గాలప్పగించు..." అంటూ జవాబు చెప్పారు బాబా. తరచి చూసుకుంటే మన జీవితంలోని ప్రతీ అడుగులోను వారిచ్చిన అనుభవాలను, సదా మన తోడుండి మనలను నడిపించిన తీరును ఒక చక్కటి పూదండలా పేర్చుకుంటే సద్గురు సన్నిధే నిజమైన పెన్నిధి అని తెలుసుకుంటాము. "అనుభవమే నిజమైన అవగాహన, మీ స్వానుభవాన్ని విశ్వసించండి. గురువుపై పూర్తి విశ్వాసముంచండి, అదే నిజమైన సాధన. సాయిఊసే... సాయిధ్యాసే.... లేదు లేదిక వేరే బాట..." అనుభవాన్ని నమ్ముకుంటే మనకు ఏది అవసరమో తెలుస్తుంది. "కడలుడిపి నీరాడగా" అన్నట్లు, కోర్కెల వలయంలో తిరుగుతూ, మనల్ని మనం గొప్పగా ఊహించుకుని, ఒక తెలిసీ తెలియని నైజంలో, సందిగ్ధంలో సద్గురువును బాగా డబ్బిమ్మని కోరతాము. డబ్బుతో ఏం కావాలన్నా సాధించుకో గలమన్న నమ్మకం. సరే డబ్బుండి ఆయుర్దాయం లేదనుకోండి. ఏమిటి యోగం? ఆయుర్దాయం, డబ్బూ, రెండూ ఉండి ఆరోగ్యం లేకపోతే ఎక్కడిది భోగం? డబ్బు మందుల్ని కొనిస్తుందే గాని, ఆరోగ్యాన్ని కొనివ్వగలదా? ఆహారాన్ని కొనిస్తుందేగాని ఆకలిని, అరుగుదలని ఇవ్వగలదా? అలాంటి సందర్భాల్లో కొండంత పోగేసినా, డబ్బుతో ఏమిటి ప్రయోజనం? అప్పుడు మనిషి డబ్బుని ఏం చేసుకుంటాడు?

కనుక మనిషికి కావాల్సింది డబ్బు కాదు. భోగం, ఆరోగ్యం, ఆయుర్దాయం కావాలి. సద్గురువుని కోరేవి కూడా అవే కావాలి. దీన్ని దృష్టిలో వుంచుకొనే మన పూర్వీకులు, పెద్దలు అద్భుతమైన ఉపాయం చెప్పారు. భగవంతుని, "స్వామీ! దైన్యం లేని జీవనం, అనాయాస మరణం, మీ సాన్నిధ్యం, అనుగ్రహించు" అని ప్రార్ధన చేయమన్నారు.

ఏం కోరితే ఇంకేమీ కోరాల్సిన అవసరం వుండదో, అంత అత్యున్నతమైన దానికోసమే ప్రార్ధన. ఆ ప్రార్ధనలోని అంశాలను గూర్చి లోతుగా పరిశీలన చేస్తే మనిషికి అవి తప్ప వేరే అవసరాలేమీ లేవనీ, పెద్దల సూచన వెనుక గొప్ప అనుభవం, ఎంతో లోకజ్ఞానం, ముందు చూపు ఉన్నాయని అర్థం అవుతుంది.

(ఎవరయితే నా లీలలనే మననం చేస్తూ అందులోనే మునిగిపోతారో, వారికి జ్ఞానరత్నాలు లభిస్తాయి. **– శ్రీసాయి**)

**దైన్యం ఎరుగని జీవితం** : ఏనాడు తిండికి, బట్టకూ లోటు లేకుండా ఎక్కడా దేనికి చేయి చాచే అవసరం రాకుండా మనిషి బతికినన్నాళ్లు హాయిగా, కులాసాగా గడిచిపోవడం. ఆందోళన, దిగులు, బెంగ, దుఃఖం,



కష్టం, అవమానం వంటివి దైన్యస్థితికి గుర్తులు. ఇవి లేని జీవనం – దైన్య రహిత జీవనం. "నా భక్తుని ఇంట అన్న వస్త్రాలకు లోటు వుండదు". "నేనుండగా భయమేల" అంటూ శ్రీసాయిబాబా, "బాబా దగ్గరకొచ్చాక బాధ అన్న పదానికి అర్థం లేదు" అంటూ శ్రీబాబూజీ, మనకు ఏనాడో అభయమిచ్చారు. ఈ అభయ వచనాలలో దాగున్నదే దైన్యరహిత జీవితం. దీనస్థితి ఏమిటో తెలియకుండా మనుగడ సాగిపోతే మనిషి గొప్ప ధన్యుడు. **పుట్టుకతోనే మనం ధన్యులం.. బాబాతో సంబంధం వున్నవాళ్లం గనుక. పుట్టకముందే మనల్ని ఎన్నుకున్నారు గనుక.** నిజానికి డబ్బుకోసం వెంపర్లాట లేనివాడే ఈ భూమి మీద గొప్ప సంపన్నుడు! (ఫకీరే నిజమైన ఐశ్వర్యవంతుడు – బాబా)

సాయి అభయం మన మనస్సులో నిలుపుకొని, మన ఆచరణను మలచుకోవాలి. వెంపర్లాటలేని జీవితాన్ని ఆస్వాదించడానికి ఆయత్తమవ్వాలి. ప్రతీ అంశాన్ని, నిత్య జీవితంలో సాయిపరంగా సమన్వయం చేసుకోవాలి. అదే నిజమైన సాధన. అదే మనల్ని ఉన్నతులుగా ఉన్న స్థితి నుండి ఉన్నత స్థితికి చేర్చేది.

**రెండోది అనాయాస మరణం :** "నా కాకాను నేను విమానంలో తీసుకుపోతాను" అన్నారు బాబా. శ్రీబాబూజీ మనకు సాయిభక్తి సాధనా రహస్యంలో అర్థమయ్యే రీతిలో 'మృత్యుంజయ మంత్ర రహస్యం' వ్యాసంలో 'అనాయాస మరణ'మంటే తెలియచెప్పారు. 'తొడిమ నుండి విడివడిన దోసపండు వలె మృత్యువు నుండి బయటపడెదము గాక". ఆనందముగా ప్రాణత్యాగము చేసినచో దానిని 'అమృతస్థితి' అందురు. అనాయాసమైన అట్టి మరణాన్ని – ఊర్వారుక మోక్షమన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్న నానుడి మనందరికీ తెలిసిందే. పోగొట్టుకున్నాక విలువ తెలిసి వచ్చే వాటిలో ఆరోగ్యం మొదటిది. దేహంలో ఏ నొప్పో బయటపడే దాకా మనకు ఆరోగ్యం అనే పదం గుర్తుకురాదు. అనారోగ్యం రూఢీ అయ్యేదాకా శరీరాన్ని మనం పట్టించుకోం. కనుకనే ఆరోగ్యం అనేపదానికి శాస్త్రం 'నీ ఒళ్లు నీకు తెలియకపోవడం' అనే అర్థాన్ని సూచించింది. ఆమయం అంటే 'అనారోగ్యం'. రోగం ఏ కోశానా లేని స్థితిని 'నిరామయం' అంటారు. మనిషిని సమస్త రోగాలనుండే కాక ఆదిభౌతిక (దేహం), ఆదిదైవిక (ప్రకృతి), ఆధ్యాత్మికమనే మూడు లోపాల నుండి సైతం బయట పడేస్తాడు కనుక సద్గురువుని 'నిరామయుడు' అన్నారు. ఆ నిరామయుడైన సద్గురుని దయతో జీవితం అర్థవంతంగా, ఆనందంగా తొణికిసలాడినంతకాలం ఆయన గురించి వింటూ, ఆయన గురించి మాట్లాడుకుంటూ సాగేట్టు చూసుకుందాం. ఆయన ఊసు, ధ్యాసలలో గడపడం కోసం మన అడుగులను సద్గురుపథంవైపు మలచుకుందాం. అలా సాయిమయంగా సాగిన జీవికి అనాయాస మరణం, ఊర్వారుక మోక్షం తథ్యం.

**ఇక మూడోది సాయుజ్యం :** "ఈ సద్బ్రాహ్మణుడు లక్షలాదిమందిని శుభ్రమార్గాన నడిపిస్తాడు. "నిన్ను చివరికంటా గమ్యం చేరుస్తాను..." అంటూ చెప్పిన సాయిమార్గంలో మనం నడిస్తే – సంవత్సరాలు శ్రమించి చదివి, పరీక్షలు వ్రాసాక మన చేతికి 'పట్టా' వచ్చినట్లు లభించేదే 'సాయుజ్య' మంటే. సద్గురుపథంలో



సాయుజ్యమంటే "సద్గురుమూర్తి ఎప్పుడెప్పుడూ భూమిమీద అవతరిస్తే అప్పుడప్పుడు వారి లీలావినోదంలో మనకు ఒక పాత్ర లభించడమే!" ఇలా దుర్లభమైన నరజన్మ, అందునా సద్గురునితో సాంగత్యం లభించడం ఎంతో కష్టం. లభించాక ప్రతిక్షణాన్ని సద్గురు ప్రసాదంగా ఆస్వాదించడం, అనుభవించడమన్నది కేవలం 'గురుకృప'తోనే సాధ్యం. ఏనాడైతే ప్రతీక్షణాన్ని సద్గురు ప్రసాదంగా స్వీకరిస్తామో ఆనాడు జీవితం చరితార్థమైనట్లే. ప్రార్థన చిన్నదైనా, దైన్యంలేని జీవనం, అనాయాస మరణం, సాయుజ్యం – కావాలంటూ ఎంతో భావార్థాన్ని ఇమిడ్చి మనకు అందించారు పెద్దలు. అందుకే **"అర్థం తెలిసిన భజనలు – హృదయ మందిరాల్లో వెలిగించిన భక్తి జ్యోతిని దేదీప్యమానం చేస్తాయి" అన్నారు శ్రీబాబూజీ.**

**– గురుకృప**

## తపించి తరించే ఆనవాలు - ఆరాధనోత్సవం

గురుదేవుల పుణ్యతిథిని గురుబంధువులందరూ అతి పవిత్రమైన పర్వదినంగా శ్రద్ధాభక్తులతో జరుపుకుంటారు. ఆయనవల్ల ప్రభావితులై సాయిమార్గంలోకి వచ్చిన, రావాలననుకుంటున్న వేలాదిమందికి ఆ రోజు ఎంతో ముఖ్యమైనది. ఆ రోజు ఆయన మరో రూపం ధరించిన రోజు. ఆ రూపావతరణాన్ని గుర్తెరిగిన స్థాయి చిక్కిన రోజు మనందరికీ. అందుకే ఈ ఉత్సవం. బాబా దేహత్యాగం చేయదలచినపుడు "రెండు ఊయలలు వ్రేలాడ గట్టండి" అంటూ లేదులే ఒకటే తెండి అన్న మాటల అంతరార్థం – "మరణం అన్నది పుట్టుకే" ఇంకో రూపంలో అని తెలియచెపుతున్నది. మన ఇళ్లలో బిడ్డ పుట్టగానే వాడిని ఊయలలో పడుకో పెడతాం. ఇలా రూపం మారుతున్న వైనం (విత్తు – మొక్కగా, మొక్క–చెట్టుగా, చెట్టు–వృక్షంగా, వృక్షం–కట్టెగా, కట్టె–బొగ్గుగా, బొగ్గు–మట్టితో కలుస్తున్నది. ఒకటి పోతేనే రెండవది వస్తున్నది. పోవడం–మరో రూపంలోకి మారడమే కదా!). ఈ ఆరాధనోత్సవాన్ని కొందరు గురుదేవుల సమాధి వద్ద, కొందరు బాబా మందిరాలలోను కొందరు తమ తమ ఊళ్లలో తమ తమ సత్సంగ సభ్యుల మధ్య, సత్సంగ కేంద్రాలలో (సత్సంగ కేంద్రాలే నిజమైన సాయి మందిరాలు అంటారు శ్రీబాబూజీ. సాయి సంప్రదాయం పరిఢవిల్లుతున్న కేంద్రాలు సాయిపథ సత్సంగ కేంద్రాలు), కొందరు తమ కుటుంబాలలోను (ఇళ్లలోను) ఈ ఉత్సవం జరుపుకుంటారు. (40వ రోజున జరుపుకునేది ఆరాధన – ఆ సమయానికి మనసు అవగాహన కొచ్చి, ఆయన్ను దర్శించగలదు అన్నది అంతరార్థం) కొందరు భక్తిగా జరుపుకుంటే, కొందరు ఘనంగా జరుపుకుంటారు. ఎవరి అవగాహననుసరించి, వారి వారి స్థితిగతులననుసరించి, సంస్కారాల కనుగుణంగా జరుపుకోవడం పరిపాటి. ఇది చాలా సున్నితమైన అంశం. ఈ సందర్భంలో వివేచన చేసి అసలు 'ఆరాధన' ఎలా (ఎందుకు) జరుపుకోవాలి? మనకు ఇష్టమైనట్లా? ఆయనకు ఇష్టమైనట్లా? మనం జరుపుతున్నాం కనుక మనకిష్టమైనట్లు జరుపుకోవాలా? ఆయనకు జరుపుతున్నాం కనుక ఆయనకు ఇష్టమైనట్లు జరపాలా? మన ఇష్టాఇష్టాలకు తావులేకుండా, ఆ మహిమాన్వితుని మది ఏ ఆశయానికై సదా తపించిందో, ఆ



స్ఫురణతో, వారి అనుపమానమైన దివ్యత్వం మనలో రగిల్చిన ప్రేరణతో "సాయి...సాయి... అంటూ మనం 'సాయి'అయ్యేట్లు" సాయియానంలో సాగడమే సరియైనది. "సర్వజీవ స్వరూపుడు శ్రీసాయి" అంటూ వారు సాయిని గుర్తించిన వైనాన్ని, "సాయివంటి దైవంబు లేడోయి, లేడోయి" అంటూ వారు దర్శించిన సాయి వైభవాన్ని, "మనిషి దైవంగా ఎదగాలన్న, ఎదగగలడన్న" వారి సమున్నత దృక్పధాన్ని ప్రతిబింబించేలా ప్రతి కార్యము ఉండడమే సరియైనది. ఈ విషయం అవగాహనకు రాగానే మహాత్ముల జన్మదినాలు, పుణ్యతిధి పర్వదినాలు – 'ఆడంబరాల పండుగలు' కాకూడదన్న సద్గురువాక్యాలు మనలోని సద్భక్తుడిని మేల్కొలుపుతాయి. ఆడంబరంగా చేయడం, ఎంతో ధనం వెచ్చించడం ఇలాంటివన్నీ మనమా రోజంతా గురూజీ గూర్చి కాని, బాబా గూర్చి కాని, ఆయన బోధన గూర్చి కాని, ఆలోచించనివ్వకుండా చేస్తాయి. అయితే గురువుగారికి నచ్చేట్లు ఆరాధన జరుపుకోవడం ఎలా? గురుదేవులు మన నుండి ఆరోజుగాని, మరేరోజుగాని, ఆశించేదేమిటి? 'సాయి ఊసు, ధ్యాసలలో' మన జీవనం గడవడం. జరుగుతున్న ప్రతిదాన్ని ఆయన ప్రబోధంగా స్వీకరించగలగడం, జరుగుతున్న ప్రతి సంఘటన ఇంకా, ఇంకా ఆయనకు చేరువయ్యేందుకే అన్న అవగాహనతో ఆస్వాదించడం (Lord and evil alike will come, we should regard them impartially) సాక్షీభూతంగా నిలవడం, ఆధ్యాత్మికంగా గడపడం (అన్నిటా, అంతటా నిండి వున్న చైతన్య రూపాన్ని చూస్తూ లేదా చూసే ప్రయత్నం చేయడం) దీనికి దోహదపడేలా జీవనమంతా ప్రయత్నించేందుకు ఈ ఆరాధనోత్సవంలో మనం స్ఫూర్తిని పొందాలి. ఈ రోజుని అందుకు అంకితం చేయాలి. దానికి అనుగుణంగా ఆరోజు మన దినచర్యను ఏర్పరచుకోవాలి. (Create your own environment) సామూహికంగా జరుపుకుంటున్నపుడు అనవసరమైన వంతులకు, అభిమానాలకు లోనుకాకుండా గురుబంధువులంతా ఆయన బిడ్డలమేనన్న ఎరుకతో గడపాలి. సాటి గురుబంధువులతో సామరస్యంగా ఉండలేని వాళ్లం, సాటి వారిని ప్రేమ, గౌరవాభిమానాలతో చూడలేని మనం ఆయన భక్తులమెలా అవుతాం? ఇట్టి స్థితిలో మనం చేసుకునే 'ఆరాధనోత్సవం' ఎవరికి ఉపయోగకరం? ఇలా ఎందుకూ పనికిరాని, తనకుగాని, నీతో వున్న మరొకరికి గాని, సాటివారికిగాని ఉపయోగపడని ఏ విషయమైనా గురువుగారి దృష్టిలో అల్పమైనదే. అలాగే మనకుగాని, ఇతరులకుగాని ఉపకరించే ఏ విషయమైనా ఆయనకెంతో ఇష్టం. కనుక "ఆరాధనోత్సవాన్ని" రోజంతా ఆయన (సాయి) ఊసు, ధ్యాసలలో సాగేలా దృఢంగా నిశ్చయించుకుందాం. ఇందుకు తపిద్దాం, శాయశక్తులా ప్రయత్నిద్దాం (ఉడతాభక్తిగా) ఈ తపన, ప్రయత్నాలతో ఆయనను మురిపిద్దాం. మురిసిన గురుదేవుల ఆదరణ, సహకారాలనే అనుగ్రహ జల్లులలో మునకేసి తరిద్దాం. తపించి, తరించే (ఆనవాలు) గురుతు – గురుసాన్నిధ్యం.

మన జీవితాలను ఎంతో శోభాయమానంగా తీర్చిదిద్దిన ఆ మహామహితాత్ముని ఆరాధనోత్సవ పర్వదినాలలో ఒక్క క్షణాన్ని కానీ, ఒక్క వీసమెత్తు శక్తిని కాని, ఒక్క చిన్న మాటను కానీ, దేనినీ వృధా



పోనివ్వకుండా సమయమంతా సాయిమయం చేసుకొని సద్గురు ఆరాధనోత్సవాన్ని పరిపూర్ణం చేసుకుందాం. జన్మ జన్మలకు ఆ ప్రేమ మూర్తి పాదాల చెంతన ఒక చిన్న పుష్పంగానైనా సేద తీరేటట్లు అనుగ్రహించమని వేడుకుందాం. వ్యర్థ కాలక్షేపాలకు, పరనిందా ప్రసంగాలకు, మనకుగాని, తోటివారికిగాని ఉపయోగపడని అంశాలకు, తావులేని "సద్గురుచంద్రుని ఆరాధనోత్సవాలను" భక్తికి హేతువుగా, 'ప్రేమ'కు తార్కాణంగా జరుపుకుందాం. **– గురుకృప**

## మహాత్ముల సన్నిధి - సాన్నిధ్యం

భగవంతుడు సాయిబాబా అంతటి విశిష్ట, సంప్రేరిత సాధువు రూపంలో తనను తాను ఎలా ఆవిష్కరించుకుంటారో దీని వలన మనకు అవగతమవుతుంది. "నేను ఇవ్వగోరేది వాళ్ళు కోరడం ఆరంభించేందుకు – వాళ్ళు కోరింది నేను ఇస్తాను". "నా భక్తుడు అడిగినవన్నీ ఇస్తూనే వుంటా. నేను ఇవ్వదలచుకున్నది వాడు అడిగేంతవరకు" – సాయిబాబా.

నా తండ్రి దయామయుడు, అతని దయ అపారము. అతడు నాకు అపారమగు తన సాన్నిధ్యము అందించుచున్నాడు. ఆ సాన్నిధ్యమును మీ కందించుటకే నేనిచటనున్నాను. నేనందించునది మీరందుకొనక మీరేమేమో కోరుచున్నారు. నా తండ్రి దయ వలన మీరు కోరినవి మీకు నేనిచ్చుచున్నాను. మీరు ఆ దైవ సాన్నిధ్యమును కోరుదురేమో అని ఎదురుచూచుచున్నాను. మీరది కోరునంతవరకు, కోరిన వెంటనే మీకందించుటకు నేను సమాధియందు వేచియున్నాను. దైవము నాకిచ్చిన దానిని పూర్ణముగా మీకు ఇచ్చువరకు నేనిచ్చుటనేయుందును. "The Sadguru wants everybody to have the same fulfilment that he is experienceing". సర్వమతముల సందేశము – సాన్నిధ్యమే. దైవసాన్నిధ్యము మనలను అన్ని విధములుగా పరిపూర్ణులను చేయును. నిశ్శబ్ధమే – సాన్నిధ్యమొసగు స్వభావము. నిశ్శబ్ధమునందు మనస్సు సాన్నిధ్యమునకు చేరువగును. మనో నిశ్శబ్ధమనగా – భావరహిత స్థితి. అట్టి స్థితిలో సాన్నిధ్యము హృదయము నుండి మనోద్వారమున ఇంద్రియములను, శరీరధాతువులానాక్రమించి మొత్తము శరీరతత్వాన్ని దివ్యత్వముతో నింపును. అపుడంతయు దివ్యమే అగును. దివ్యమే గోచరించును. దివ్య జీవనమే నిలుచును.

**– ఆర్థర్ ఆస్బర్న్**

ఎటువంటి కృషి లేకుండా, పైసా ఖర్చు కాకుండా కోరికలు తీరే మార్గం లభిస్తే ఆ కోరికలు తీర్చడంలోని మహనీయుల దివ్యత్వాన్ని దర్శించడం మనం మరుస్తున్నాం... మరచిపోతున్నాం. అన్నదానికి గురుతు ఇంకా ఇంకా విషయాదులను కోరడం. స్వయంసాధన, పట్టుదల, భక్తి, విశ్వాసం, త్యాగ భావనలు (దర్శిస్తే, దివ్యగుణ స్వరూపం) మనలోని అప్రమత్తతకు నిదర్శనం... ఆ దివ్య గుణ స్వరూప సందర్శనం, ఇట్టి దర్శన, సందర్శన, నిదర్శనాదులే మనకు సాయి చూపిన నడిచిన బాటే ... అదే సాయిపథం.. గురుపథం... సద్గురుపథం...



# జీవితాన్ని జీవించడం

భగవంతునితో జీవించడం ఎలా? ఆయనను ప్రేమించడం ఎలా? ఆయనతో బాంధవ్యాన్ని కల్పించుకోవడం ఎలా? ఆయన ఆనందమయులు, ప్రతి ఒక్కరితోను ఆ ఆనందాన్ని పంచుకున్నవారు (మహాత్ములు). బాబా సచ్చరిత్రలోని లీలలను అధ్యయనం చేస్తున్నపుడు, మనం బాబాతో జీవించి ఉండగలిగితే ఎంత అద్భుతంగా ఉండేదోనన్న ఊహ మనకు అప్పుడప్పుడు కలుగుతుంది. వారితో కలిసి జీవించినవారు ఇంకా ధన్యులు. వారిని గూర్చి విని, వారిని చూసినవారు ధన్యులు. వారిని సేవించిన వారు ఇంకా ధన్యులు. ఈ మహాత్ములు మనకు కనుమరుగైనప్పటికీ వారు మరణించలేదు. యోగులు, భక్తులు ఇప్పటికీ వారి ఉనికిని అనుభూతి చెందుతున్నారు. ధ్యానంలో వారి జ్యోతిర్మయరూపాన్ని దర్శిస్తున్నారు. మనం అన్ని జీవులలోను పరస్పర సంబంధం కలిగియున్నాము. ఈ సంబంధాన్ని గుర్తించి ఆ గ్రహింపుకనుగుణంగా మసలుకొనేవారు భగవంతుని సంబంధాన్ని పొందిన వారవుతారు. ఉదాహరణకు మనకు పనికిరాని వాయువు (మన నిశ్వాస నుండి బయల్పడుతున్న $Co_2$ అంటే కార్బన్ డయాక్సైడ్, Vehicles emmison ఇదంతా Pollution) ను స్వీకరించి, మనకు పనికి వచ్చే ప్రాణవాయువును వదిలే చెట్టు, జీవికి – చెట్టుకి ఉన్న ఈ పరస్పర సంబంధం భగవంతుని సృష్టి. ఇది అర్థం అయితే చాలదు, దాన్ని ఆచరిస్తే ఆయనతో సంబంధం కలిగి ఉన్న వారమవ్వడం సాధ్యం. ఒకప్పటి తరం చెట్టుని పూజించిన కారణం – ఈ సంబంధం గుర్తించి, కృతజ్ఞత చెప్పుకున్న వైనమే. ఇది అర్థం కాని ఈ తరం "మూఢనమ్మకం" అనే మాటతో చెట్టుని నరికేస్తున్నది. గురువుగారు చెప్పిన 'ట్రీ ఆఫ్ లవ్'లో దాని సహకారం, ఉపయోగమే దివ్యత్వం. భగవంతుని జీవనశైలి అంతే. ఆయనకు తగ్గదిగా ఉంది కనుకనే పూజార్హమైనది. ఒకప్పుడు రోగం వచ్చినవాడు ఓ ఆకునో, ఆకు పసరో త్రాగేవాడు. వాడికి అర్థం అయింది తన కొచ్చిన రుగ్మతకు కావాల్సిన ఆకు ఏదో. ఇలా చెట్టు యొక్క తత్వాన్ని దర్శించి, దాన్ని భగవంతునిగా ఆరాధించాడు. అందుకే చెట్లు నాటేవాడు. ఒక్క ముక్కలో చెప్పాలంటే వృక్షజాతి లేకపోతే మానవజాతి మనుగడ సందేహాస్పదమే. వృక్షాలలో, మహాత్ములలో చెడును తొలగించి, మంచిని పెంపొందించడమే జీవన విధానంగా కనిపిస్తుంది. రెంటికీ తెలిసింది నీడనివ్వడమే, తోడుగా నిలవడమే. మనిషి అందంగా, ఆనందంగా జీవించాలంటే కావలసింది కేవలం "నేర్చుకునే దృక్పథమే". **–గురుకృప**

శాస్త్రాలలో కఠినంగా, సూక్ష్మంగా చెప్పే విషయాదులను మహాత్ములు తమ జీవితాచరణతో (లీలలుగా, అనుభూతులుగా) రంగరించి, సులభంగా తమ తత్త్వ వివేచన దృష్టితో మధించి (ప్రేరణనిచ్చి) అందరికి సరళమైనదిగా, సులభంగా అందుకునేలా చేస్తారు. అందుకే అవి మధురంగా వుంటాయి. వెలుగు దివ్వెలై మార్గాన్ని సుగమం చేస్తాయి. మన జీవితాలను దరి (గమ్యం) చేరుస్తాయి.

కనబడకపోతే దేవుడున్నాడా అని ప్రశ్నిస్తాం. కనిపించితే మనిషేకదా అని ఏమరుపాటు చెందుతాం, ఈ ఏమరుపాటు లేకుండా ఆరాధించగలిగే అప్రమత్తత కోసమే పారాయణ, సత్సంగం, స్మరణ, మననం. ఇత్యాదులన్నీను.

**విషయాదులందు విరాగం - భగవంతునిపై అనురాగమే - భక్తి**



# విడవని చేయి - సాయి

"స్వామీ – సాక్షాత్తూ భగవంతుడే" అని ఆనాడు మేము గుర్తించలేకపోయాము. కాలం గడిచిపోయింది. తేరుకునేలోపే "స్వామి మహాసమాధి చెందారు" అంటూ తమ బాధను వెలిబుచ్చుతున్నారు, స్వామికి ప్రత్యక్షంగా సేవ చేసిన కొందరు, స్వామివారి దర్శనంలో ఎక్కడా లేని ప్రశాంతతను పొంది, మన భావాలలో సాత్వికతకు బీజం పడి, భక్తి (ప్రేమ) భావం విస్తృతమై స్వామిని అంతటా చూసే దాని పట్ల మక్కువ చోటు చేసుకుంటుంది. సామరస్యం వెల్లివిరుస్తుంది. సామవేదంలా జీవనం సాగుతూ ఉంటుంది. క్రమక్రమంగా "స్వామిని తలవకుండా ఉండలేము, నాలోని ప్రతి తలపు నా స్వామిమయం, స్వామిని చూడకుండా ఉండలేము. నా స్వామి పాదాలు నా కనుల నిండెను. నా స్వామి రూపుతో నా మనసెంతో పొంగేను. స్వామి సన్నిధి నిరతం అనుభూతి ప్రదం, నాలోని అణువణువు నా స్వామి ఆలయం, నాలోని కణకణము నా స్వామి నిలయం".

స్వామిని కోరిన కోరికలు తీర్చే కల్పవృక్షమందామంటే కోరిన కోరికలే కాదు, కోరనివి కూడా ప్రసాదించే స్వామిని ఏమనగలము, ఏమని కీర్తించగలం?

కోరికలు తీరుస్తూనే కోరికలు కోరని ఉత్తమస్థితిని ప్రసాదిస్తూ ప్రగతిపథంలో పయనింపచేస్తూ... ఆధ్యాత్మికోన్నతిని అందిస్తున్న స్వామిని ఏమని కీర్తించాలి? మన ఇహపర శ్రేయస్సు కోరి మన కోసం అవతరించిన సద్గురువుని – తండ్రి (బాబా–బాబూజీ) అని చిత్తశుద్ధితో (త్రికరణశుద్ధితో) అనగలము. నిరతము మన శ్రేయస్సు తప్ప వేరేమి చింతనలేని.. మన అంతరాలంలో కొలువుండే ఆత్మబంధువాయన. మరి ఇట్టి స్వామి దర్శనానికి ప్రధమంగా ఎలా చేరగలిగారో ఎలా రప్పించబడ్డారో ఎలా చేర్చుకోబడ్డారో ఒక్కసారి మనన రూపంలో కళ్లముందు దర్శించండి.. ఎందుకంటే సద్గురు సందర్శనమే అసలైన అనుభవం కదా! ఆ మరువలేని మధుర స్మృతులను అందరితో పంచుకునేందుకు సంసిద్ధులమై, ఆయన చేతిలో పనిముట్టుగా మారే పరివర్తన, పరిణితి... పరిమాణాలకు నిరూపణలుగా నిలుద్దాం. అలా ఆయన ఎప్పుడు మనల్ని పట్టుకునే ఉన్నారు... ఉంటారు అన్నదానికి నిదర్శనంగా నిలుద్దాం. (Let us become an instrument in Baba's hands... so we are always held by him)

***మూలం : సద్గురు కృప...***

పూజలు, నోములు, యజ్ఞాలు, వ్రతాలు ఇవేనా ఆధ్యాత్మికత అంటే? ఇవి మాత్రమేనా? అంటే ఇవి కూడా కానీ ఇవే కాదు. వేద వేద్యునికై తపించడం, వేద విహితంగా జీవించడం, ఆధ్యాత్మికత వేద విహితంగా అంటే? వేదం అందరికీ తెలుసా? విహితం అంటే అర్థం తెలుసా? భగవంతునికి ప్రీతిపాత్రంగా జీవించడమే వేద విహితం. (ఆకలిగొన్న వారికి ఆహారం, దాహార్తికి నీరు, బట్టలు లేనివారికి బట్టలు ఇవ్వు. వారు నాకెంతో ప్రీతిపాత్రులు. – శ్రీసాయిబాబా)

**ఆనందంగా ఉండటం జీవితానికి అంతిమ లక్ష్యం కాదు -**

# చిరునవ్వులు - చిరుదివ్వెలు



పూజ్యగురుదేవుల హస్తం సహజమైనది, సజీవమైనది, సృజనాత్మకమైనది – సంస్కరణశీలం గలది. వారిలో ఒక అనుష్ఠాన వేదాంతి ఉన్నారు. ఒక దేశభక్తుడు ఉన్నాడు. ఒక బోధకుడున్నాడు. ఒక ఘనవైద్యుడున్నారు. ఒక సాహితీవేత్త ఉన్నారు. ఓ మాటకారి – ఓ చేతల వేదాంతి ఉన్నారు. ఇలా బహుముఖాలుగా వెలుగులు విరజిమ్మే కాంతిపుంజాలు... ఎవరికి తగ్గ వెలుగులు వారికందించేందుకే. గురువుగారి మాటలలో ఏ ఒక్క పలుకునూ కూడా మనం విడిచిపెట్టకూడదని – ఆ 'శ్రద్ధ' మనం వహించిననాడు మానసిక ఉల్లాసాన్ని, విజయపథంలో సాగేందుకు ప్రేరణను కలిగిస్తాయి వారి మాటలు.

ఆ మహనీయుని చూపుమరల్చుకోలేని వదనం ఎందరినో ఆకర్షించింది. ఆకర్షితులైనవారందరికీ మృదు మధురమైన తన వచనాలతో, అత్యంత ఆసక్తిదాయకమైన తన రచనా వ్యాసాంగాలతో సాయితత్త్వసారాన్ని 'ఉగ్గు'గా పట్టి బిడ్డలందరినీ – తల్లిగా, తండ్రిగా ఆదరించి – మనందరికీ, సద్గురువుగా వెలుగొందారు. పురాణేతిహాసాలలోని సార్వకాలీనము, సార్వజనీనము అయిన సందేశాన్ని దేశ, కాల పాత్రలకు అనుగుణంగా మలచి, తనదైన బాణీలో వివరించడం ద్వారా ఆధునికులం – ఆధ్మాత్మికతకు విముఖులం, అని అనుకునే ఈ తరం వారందరినీ ఆశ్చర్యానుభూతులలో ముంచెత్తుతూ ఉత్తేజితులను చేసి కర్తవ్యం వెంట నడిపించారు. తనను రూపుదిద్దిన సాయి అనే దివ్యమూర్తి నుండి బహుధా వ్యక్తమవుతున్న వెలుగునకు వినమ్రుడై అంజలి ఘటిస్తూ సకల మానవాళికి జీవితాన్ని, జీవనాన్ని అందించే ఆ తేజస్సును తన దోసిళ్లతో పట్టి పోశారు. తన చుట్టూ వున్న జీవులను (సమాజానికి) సేద తీరుస్తూ, సేవచేస్తూ, సందేహాలను తొలగించడం దగ్గర నుండి సమస్యలకు పరిష్కారం చూపే వరకు సర్వమూ తానై వెలిగారు. అంతటి గొప్ప మహనీయుడు తనవారితో ఎలా మెలిగారో, వారినెలా నవ్వించారో, ఎలా కవ్వించారో. రకరకాల సన్నివేశాలు, పరిస్థితులు, ఎదురైనపుడు ఎలా స్పందిచారో, విభిన్న మనస్తత్వాల వారు తమకు చేరువైన వేళ వారితో ఎలా వర్తించారో తెలుసుకోవాలనిపించడం ఎంతో సహజం. సహజమైన ఈ కోరిక తీర్చడానికే మహాత్ముల చరిత్రలు – మనకు సద్గ్రంధాలు.

మహనీయుల సందేశం జాతికి ఎంతగా పనికి వస్తుందో, వారి జీవన సరళి కూడా జాతికి అంతగాను పనికి వస్తుంది. అందువల్ల మహనీయుల దివ్య సందేశాన్ని భద్రపరచుకోవడంతోపాటుగా భవ్యమైన వారి జీవన సరళిని, రసవత్తరమైన మార్గంలో మదిలో నిలుపుకునే ప్రయత్నంలో మానవాళి శ్రద్ధ పెట్టవలసి ఉంటుంది. మహనీయుల మనస్సునకు సరసమాడటమనేది ఒక సహజలక్షణంగా భాషిస్తూ ఉండటం అనాదిగా మానవాళి గమనిస్తూ వస్తున్న అంశమే. మహనీయుల జీవిత సన్నివేశాలను,



సంభాషణలను ఒక్కసారి ఈ దృష్టితో పరిశీలించి చూస్తే సరసమన్నది వాటిలో అంతర్లీనంగా తప్పక గోచరిస్తుంది. నవ్వడం – నవ్వించడం, నవ్వుతూ బ్రతకడమెలాగో నేర్పడం వారి జీవిత విధానంలోని ప్రధాన సూత్రంగా మనను తప్పక గమనికకు వస్తుంది. నిరంతరం ఒత్తిడులకు లోనయ్యే మనస్సును ఆ ఒత్తిడులకు అతీతంగా నిలిపి నడిపించడమెలాగో మానవజాతి వారి దగ్గర నేర్చుకోవలసిందే. **కొద్ది సమస్యలకే సామాన్య మానవులమైన మనం మానసికంగా, ఒత్తిడిపాలైపోతాం. మరి మహనీయులో! వారికి చేరువైన వారందరి జీవితాలు వారివే. అందరి సమస్యలు వారివే. అందరి అవసరాలు వారివే. మరి అలాంటపుడు వారెంతటి ఒత్తిడిని అనుభవించాలి. కాని చిత్రం! వారలా ఒత్తిడిని అనుభవించడం లేదు సరికదా! తాము నవ్వుతూ మనలను నవ్వించి ఇంటికి పంపిస్తున్నారు.** మచ్చుకు గురుదేవుల జీవితంలోని హాస్య చతురతతో కూడిన చిన్ని సంఘటనలు అవధరించండి... ఆనందించండి. పూజ్య గురుదేవుల నాన్నగారి మాటలలో...

"శరత్‌బాబు ఎక్కడుంటే అక్కడ సందడి! తన వాక్‌చాతుర్యంతో అందరినీ ఆకట్టుకునేవాడు. తను చదివి తెలుసుకున్న కొత్త విషయాలెన్నో చెప్పి అందరినీ ఆకర్షించేవాడు. కుటుంబ సభ్యులతోను, స్నేహితులుతోను కులాసాగా కబుర్లు చెబుతూ, జోకులు కట్ చేస్తూ ఉండేవాడు. ఎన్నో జోకులు, కబుర్లు కాలగర్భంలో కలిసి మరపుకు ఎర అయ్యాయి. గుర్తున్న వాటిలో ఒక్కటి మాత్రం వ్రాస్తున్నాను."

శరత్‌బాబు వంటింట్లో పనిచేస్తున్న వాళ్లమ్మదగ్గర కెళ్లి "అమ్మా! టిబెట్టు!" అనేవాడు. వాళ్లమ్మకు ముందు అర్ధమయ్యేది కాదు. కాస్త ఆలోచించిన మీదట అర్ధమై, "నేపాల్!" అనేది. శరత్‌బాబు ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకొని తర్వాత నిరాశతో "ఇఫ్చ్" అని పెదవి విరుస్తూ వెళ్లిపోయేవాడు.

ఈ జోక్ మీకర్ధం కాలేదనుకుంటా, ఈ టిబెట్, నేపాల్ ఏమిటి? ఈ కోడ్ భాషకు అర్ధమేమిటని ఆలోచిస్తున్నారు కదూ! ఇందులో కోడ్ ఏమీ లేదు, చెబుతావినండి. శరత్‌బాబు వాళ్లమ్మ దగ్గరకెళ్లి, "అమ్మా!టీ పెట్టు" అనడిగాడు. వాళ్లమ్మ "పాలులేవు" అని చెప్పింది. శరత్‌బాబు పాలు లేనందుకు నిరాశపడి పెదవి విరుస్తూ వెళ్లిపోయాడు. ఇక్కడ జరిగిందదే. (వివరణ : టీ+పెట్టు = టిబెట్టు, నే అంటే నో, నో+పాల్=నేపాల్)

అప్పటి నుండి శరత్‌బాబు టిబెట్ అనడం, వాళ్లమ్మ పాలున్నా కూడా తమాషాగా నేపాల్ అనడం ఆనవాయితీ అయిపోయింది. ఈ జోక్ నాకు కూడా ముందు అర్ధమయ్యేది కాదు. నాభార్య నడిగితే విషయమర్దమైంది.

**– గురుకృప**

**సాయి సమగ్రదర్శిని : www.saibaba.com**

**సద్గురు తత్త్వ దర్శిని : www.gurukrupa.info**

గురుబంధువులు తమ అనుభవాలను పంపవలసిన mail ID : **gurukrupa@saimail.com**

# నిరాడంబరతకు నిలువుటద్దం




సాయినాథుని కృపా విశేషంగా నా ఆరవ ఏట సాయిబాబా ఫొటో చూడటం జరిగింది. ఆ ఫోటోని చూడగానే నా మనస్సు ఆ ఫొటోపై లగ్నమై పదే పదే చూడాలనిపించింది. మాసిన గడ్డం, చినిగిన చొక్కా వేసుకొని ఒక రాయిపై ఎంతో సాదాసీదాగా నిరాడంబరంగా వున్న వారి రూపం నన్నెంతో ఆకర్షించింది. వారి పేరు తెలియదు.వారు ఎక్కడుంటారో తెలియదు. వారిని గురించి ఏమీ తెలియకపోయినా వారిలో వున్న సింప్లిసిటీ నన్ను వారివైపుకి ఆకర్షించింది. వారి చరిత్రను తెలుసుకునే కొద్దీ వారి జీవిత విధానంలో వున్న నిరాడంబరత్వం నాకు ఎంతో నచ్చి వారివైపు మనస్సు ఆకర్షించేలా చేసింది. ఇప్పటికీ బాబా ఫొటోకి ఏ అలంకారం లేకుండా వుంటేనే నాకు నచ్చుతుంది. ఆధ్యాత్మిక జీవితం గురువు లేకుండా వారి నిర్దేశకత్వం లేకుండా నడవవని అన్ని ఆధ్యాత్మిక గ్రంథాలు చెప్పాయి. నేను ఆ మార్గంలో నడవాలని ఎందరో గురువుల వద్దకు పోయాను. ఎందుకో వారి ఆడంబరమైన జీవన విధానం నాకు నచ్చేది కాదు. సాయినాథుని అనుగ్రహ విశేషంగా సాయినాథుని శరద్బాబూజీగారు నాకు లభించారు. అపారమైన ఆధ్యాత్మిక జ్ఞానం వున్నా పైకి మాత్రం ఏమీ తెలియని వారి వలే వుండి, మనకు అవసరమైనపుడు అడిగిన ప్రశ్నలకు ఎంతో ఓర్పుతో, నేర్పుతో సమాధానమిచ్చేవారు. బాహ్యాడంబరాలు ఏమీ వుండేవి కాదు. నిరాడంబరమైన జీవన విధానం నాకు ఎంతో నచ్చింది. ఆహారం విషయంలోగాని, నిద్ర విషయంలోగాని (నిద్రించే పడక), దుస్తులను ధరించే విషయంలోగాని, ఎంతో సింపుల్‌గా వుండేవారు. వారిలోని ప్రతి చర్య నివురుగప్పిన నిప్పులాగా వుండేది.

వారి నుండి నేర్చుకోవాల్సినవి ఎన్నో వుండేవి. ప్రధానమైనది – పరిపూర్ణ మానవత్వం. మనిషి మానవత్వంతో సాటి మనిషిని గౌరవిస్తూ, వారి కష్టాలలో పాలు పంచుకుంటూ సాటి మనిషికి ఎలా ఉపయోగ పడాలో వారిని చూసి నేర్చుకున్నాను. వారికి అన్ని విధాల నచ్చేది మనం మానవత్వంతో జీవించడం. “మనిషిగా మిమ్మల్ని ఎదిగించి, దైవంగా మలచే పని నేను చేస్తాను” అనేవారు. పరిపూర్ణ దైవత్వం లోపల ఉంచుకొని సామాన్య మానవునిలాగా మన మధ్య జీవిస్తూ సాదాసీదా జీవితం గడపడం నాకు బాబాను గుర్తుచేసేది. సాక్షాత్ దైవమయి వుండి “నేను అల్లా బానిసను, అల్లాయే యజమాని” అని సాయిబాబా అనేవారు. అదే పంథా గురువుగారిలో కనిపించేది. మనం ఏ కోరిక కోరినా, సమస్య చెప్పినా, కష్టాలతో పోయినా వారు శ్రద్ధగా విని “బాబా చూసుకుంటారు” అనేవారు. “చేసేది, చేయించేది సాయే” అనేవారు. “నేను సాయిమార్గంలో వెళుతున్నాను. ఎవరు నాతో రాదలిస్తే వారు నాతో రండి. అందరం బాబా అనే గమ్యం చేరుదాం” అనేవారు. సాయినాథుని అనుగ్రహ ఫలితంగా సద్గురుస్వరూపులైన శ్రీబాబూజీ నాకు లభించడం, వారితో కలసి మెలసి జీవించే భాగ్యం కలగడం, వారిని సేవించుకునే అదృష్టం కలడగం, సన్నితంగా వారిని అన్ని కోణాలలో నిశితంగా దర్శించగలగడం నా పూర్వజన్మ పుణ్యంగా భావిస్తున్నాను. గురువుగారు అనేవారు నాకు వారికి ఎంతో ఋణానుబంధం వుందని. సద్గురువుకు ఉండవలసిన గుణాలలో ఒకటైన నిరాడంబరత్వానికి నిలువెత్తు దర్పణం శ్రీబాబూజీ. వారు నడిచిన మార్గంలో నడిపిస్తూ వారు చేరిన గమ్యాన్ని చేర్చాలని ప్రార్థిస్తున్నాను.

**– డాక్టర్ బి.ఎస్.రెడ్డి, ఒంగోలు**

**గురువును సంపూర్ణంగా నమ్ముకో! అదే అసలైన సాధన**




చరణములు అంటే నడిచేవి. పాదుకలు చరణములకు వేసుకునేవి.
వెళ్లే మార్గంలో తోడ్పడేవి. మనలను సంరక్షించేవి. నీ చరణములకు
అలవాటు పడిన ఈ పాదుక ధర్మాన్ని పాదుకొలపనీ స్వామి!
ఆ పాదుకలకు నమస్కరిస్తే ఆ పథం నాకు తడుతుంది. పాడకడుతుంది.
పాదుకలు పెట్టుకొని, 14 సం॥ భక్తితో కట్టుబడి జీవించేందుకు
దీక్ష స్వీకరించిన భరతుడు మనకు ఆదర్శం కావాలి.



మీ పాదములకు – ప్రణమిల్లితిమి
మీ పథమున  నడుచుటకే !

అంతుపట్టని తత్త్వము మీది – అంతర్యామి తత్త్వమిది
మీ (ప్ర) వర్తనమే మాకాదర్శం
మీ సందేశమే  మాకుపదేశం !

మీ రచనలే మాకు ప్రమాణం – మీరే మాకు శరణ్యం
మీ ఆచరణలే మాకు ప్రేరణం !